# భారత శక్తి

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి : 20 | సంచిక : 295 | ఆదివారం,మే 17 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00




# భూగర్భ దోపిడి... అరికట్టేవాడేడి..?

- తెలంగాణ రాష్ట్రంలో అంతులేని అక్రమ మైనింగ్...
- ఇంత దోపిడీ జరుగుతుంటే పాలక వ్యవస్థ ఏమి చేస్తోంది..?
- ప్రభుత్వాలే ఈ దోపిడీలో భాగస్వాములైయ్యారు..?
- కంచె చేనును మేస్తుంటే ఇక కాపాడేదెవరు..?
- కోట్లలో ప్రజా సంపదను కొల్లగొడుతున్నారు..
- అనుమతులు లేకుండానే తవ్వకాలు, బ్లాస్టింగులు..
- చెలరేగిపోతున్న మైనింగ్ మాఫియా..
- ఎవరైనా ఎదురొస్తే ప్రాణాలు కూడా తీస్తారు..
- పర్యావరణాన్ని నాశనం చేస్తున్న దౌర్భాగ్యపు సంస్కృతి..

**మైనింగ్ మాఫియాపై " ఫోరమ్ ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ " అందిస్తున్న ప్రత్యేక కథనం..**

ఈ భూమి తన గర్భంలో ఎంతో వెలకట్టలేని సంపదను దాచుకుంది.. ఆ సంపద సమాజానికి ఉపయోగపడాలని ఆ భూమాత ఆశిస్తోంది.. కానీ ఆ విలువైన సంపదను కొందరు ముష్కరులు అడ్డగోలుగా దోచుకుంటున్నారు.. ఇటు ప్రజలకు, అటు ప్రభుత్వానికి దక్కకుండా తమ బొక్కసాలు నింపుకుంటున్నారు.. ఇతడి దారుణమైన దోపిడీ జరుగుతున్నా.. మైనింగ్ మాఫియా విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నా, ప్రభుత్వ పెద్దలు గానీ, ఉన్నతాధికారులు గానీ పెదవి విప్పడంలేదు.. చర్యలు తీసుకోవడం లేదు.. ఎందుకంటే ఆ అక్రమ మైనింగ్ వ్యవహారంలో వీరందరికీ భాగస్వామ్యం ఉంది కాబట్టి.. ఇక తెలంగాణ రాష్ట్రంలో అక్రమ మైనింగ్ ఒక వ్యవస్థీకృత దోపిడీగా మారింది. ఇసుక, గ్రానైట్, క్వార్ట్జ్, బొగ్గు, మట్టి, రాయి.. ఇలా ఏ ఖనిజాన్ని తీసుకున్నా ఒకే కథ. అధికారుల నిర్లక్ష్యం, రాజకీయ అండదండలు, మైనింగ్ మాఫియాల బలంతో రాష్ట్ర వనరులు నిశ్శబ్దంగా కొల్లగొట్టబడుతున్నాయి. ఇది కేవలం పర్యావరణ నాశనం కాదు... ప్రభుత్వ ఖజానాపై, ప్రజల అస్థిత్వంపై జరుగుతున్న పగటి దోపిడీ.

**( స్పెషల్ కరస్పాండెంట్ )**

**హైదేరాబద్, డిసెంబర్ 20 ( భారత శక్తి ) :** అసలు ఈ అక్రమ మైనింగ్ ఎలా జరుగుతోంది? నిజానికి అక్రమ మైనింగ్ అనేది ఇప్పుడు రాత్రిపూట ట్రాక్టర్లు తిప్పే చిన్నపాటి పని కాదు.ఇది ఒక భయంకరమైన పెద్ద నెట్‌వర్క్. నిబంధనలకు విరుద్ధంగా లీజుల విస్తరణ జరుగుతోంది..అనుమతించిన పరిమితికి మించి తవ్వకాలు జరుగుతున్నాయి.. నిషేధిత ప్రాంతాల్లో మైనింగ్ చేస్తున్నారు.. నకిలీ రాయల్టీ రసీదులు.. పోలీసు చెక్‌పోస్టుల వద్ద "సెట్‌ల్మెంట్" ఇవి అన్నీ కలిసి అక్రమ మైనింగ్‌ను బహిరంగ రహస్యంగా మార్చాయి.

**ఏ ప్రాంతాల్లో ఎక్కువగా జరుగుతోంది..?**

ముఖ్యంగా తెలంగాణాలో నల్లగొండ, యాదాద్రి, గ్రానైట్, రాయి తవ్వకాలు విపరీతంగా జరుగుతున్నాయి.. ఖమ్మం, మహబూబాబాద్జి ల్లాల్లో ఇసుక అక్రమ రవాణా.. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో మట్టి, క్వార్ట్జ్ మైనింగ్.. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలలో బొగ్గు అనుబంధ అక్రమాలు యధేచ్చగా జరుగుతున్నాయి.. గ్రామాల మధ్య రహదారులు పాడవుతుంటే, నదీ గర్భాలు ఖాళీ అవుతుంటే, పంట భూములు నశిస్తుంటే... అధికార యంత్రాంగం మాత్రం లంచాలు బుక్కుతూ ఫైళ్లలో నిద్రపోతోంది.

**పర్యావరణంపై విపరీతమైన ప్రభావం :**

అక్రమ మైనింగ్ వల్ల నదుల ప్రవాహ మార్గాలు మారిపోతున్నాయి.. భూగర్భ జలాలు

2లో..



**దేవాదుల ప్రాజెక్టు పనుల పురోగతిపైసమీక్షా సమావేశం**

# నిర్వహించిన మంత్రి ఉత్తమ్



**జనగామ(భారతశక్తి)మే16:** హైదరాబాద్ సచివాలయంలోని నీటి పారుదల శాఖ మంత్రి కార్యాలయంలో దేవాదుల ప్రాజెక్టు పనుల పురోగతి పై ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు గారితో కలిసి రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ ఉత్తమ్ కుమార్ రెడ్డి నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు మాట్లాడుతూ స్టేషన్ ఘనపూర్ నుండి నవాబ్ పేట కెనాల్ పై 4ఎల్ కాలువ వద్ద షెట్టర్ మరియు హెడ్ రెగ్యులేటర్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.అందుకు ఇప్పటికే 49లక్షల రుపాయలు మంజూరు అయ్యాయి. కావున వెంటనే షెట్టర్ ఏర్పాటు పనులు ప్రారంభించి వర్షాకాలంలోపు పూర్తి చేయాలని కోరారు.అశ్వారావుపల్లి కుడి ప్రధాన కాలువ లింగాల ఘనపూర్, గుండాల మండలాల వరకు 46వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందుతుందని తెలిపారు.ఈ ప్రధాన కుడి కాలువ పనులు దాదాపు పూర్తి అయ్యాయి. ఇంకా కొన్ని చిన్న చిన్న పనులు సిల్ట్ రిమూవల్, జంగిల్ క్లియరెన్స్ వంటి పనులు పూర్తి చేస్తే 46వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. కావున వేంటేనే సంబంధిత కాంట్రాక్టర్ ద్వారా పనులు పూర్తి చేయించాలని తెలిపారు.దేవాదుల ప్యాకేజి -6 పనులకు మంజూరు ఇచ్చినందుకు మంత్రి

2లో..

**పోలీసుల ఎదుట లొంగిపోయిన**

# బండి భగీరథ్

**- న్యాయవాదుల సమక్షంలో అప్పగించిన కుటుంబసభ్యులు**



**హైదరాబాద్ ( భారత శక్తి )**తెలంగాణ వ్యాప్తంగా సంచలనం రేపిన పోక్సో కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథ్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. బండి భగీరథ్‌ను ఆయన కుటుంబసభ్యులు న్యాయవాదుల సమక్షంలో పేట్ బషీరాబాద్ పోలీసులకు అప్పగించారు. మైనర్ బాలికపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథ్‌ను విచారణకు హాజరుకావాలని పోలీసులు నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే శుక్రవారం విచారణకు హాజరవుతానని చెప్పిన బండి భగీరథ్ విచారణకు హాజరు కాలేదు. మరోవైపు బండి భగీరథ్ దేశం విడిచి వెళ్లకుండా పోలీసులు లుకౌట్ నోటీసులు కూడా జారీ చేశారు. అతడి కోసం ఐదు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలోనే శనివారం బండి భగీరథ్‌ను అతని కుటుంబసభ్యులు పోలీసులకు అప్పగించారు.

మరోవైపు తెలంగాణ హైకోర్టు కూడా బండి భగీరథ్‌కు ముందస్తు బెయిల్ ఇవ్వడానికి నిరాకరించిన సంగతి తెలిసిందే. బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ముందస్తు బెయిల్ ఇవ్వడానికి నిరాకరించింది. శుక్రవారం రాత్రి 9 నుంచి 12 గంటల వరకూ సుదీర్ఘ విచారణ అనంతరం ఈ

2లో..

**పార్టీని వీడాలనుకునేవాళ్లు**

# వెళ్లిపోవచ్చు



2లో..

**రాయల్ ఎన్ ఫీల్డ్ బండెక్కిన చంద్రబాబు**




2లో..

**డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే**

# భారత్ టాప్

**- ప్రజాస్వామ్యానికి మనది మాతృదేశమన్న ప్రధాని**



**న్యూఢిల్లీ ( భారత శక్తి )** నెదర్లాండ్స్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ ది హేగ్ నగరంలో ప్రవాస భారతీయులతో నిర్వహించిన సమావేశంలో భారత పురోగతి, ప్రపంచ సవాళ్లు, భారత్-నెదర్లాండ్స్ సంబంధాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రవాస భారతీయుల ఉత్సాహం చూస్తుంటే తాను భారత్‌లోని ఏదో పండుగలో పాల్గొన్నట్లుగా అనిపించిందని ప్రధాని వ్యాఖ్యానించారు. భారతదేశం అభివృద్ధిలో దూసుకెళ్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో ఉందని చెప్పారు. దేశంలో ప్రస్తుతం నెలకు 20 బిలియన్ డాలర్ల డిజిటల్ ట్రాన్సాక్షన్లు జరుగుతున్నాయని తెలిపారు. భారత్‌లో ఒకప్పుడు కేవలం 4 యూనికార్న్ సంస్థలే ఉండేవని ప్రస్తుతం అవి 100కు చేరాయన్నారు. సెమీకండక్టర్ల అంశంలోనూ భారత్ ముందడుగు వేసిందని ఆ దిశగా పనులు కూడా జరుగుతున్నాయని పేర్కొన్నారు. నెదర్లాండ్స్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ.. ది హేగ్ నగరంలో ప్రవాస భారతీయులను కలిశారు. వారితో మాటామంతీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐలపై ప్రశంసలు కురిపించారు. లక్ష్యాలను అధిగమించి వారు పని చేస్తున్నారని కొనియాడారు.

ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ 'ఇంతటి ప్రేమ, ఉత్సాహాన్ని చూసి నెదర్లాండ్స్‌లో ఉన్నానన్న సంగతి ఒక్క క్షణం మర్చిపోయాను. భారతదేశంలోనే ఓ ఉత్సవానికి హాజరైనట్లు అనిపించింది. భారత స్నేహానికి ది హేగ్ సజీవ చిహ్నంగా మారిందని అనిపిస్తోంది. నేను నెదర్లాండ్స్ నాయకత్వంతో మాట్లాడిన ప్రతిసారీ వారు ప్రవాస భారతీయులను ప్రశంసిస్తూనే ఉంటారు. నెదర్లాండ్స్ సమాజానికి, ఆర్థిక వ్యవస్థకు మీరు చేసిన సేవకు ప్రతి భారతీయుడు గర్వపడుతున్నాడు. మీ పూర్వీకులు ఇక్కడికి వచ్చినప్పుడు ఎన్నో విషయాలను వదిలేశారు. కానీ కొన్ని విషయాలు ఎల్లప్పుడూ మీతోనే ఉండిపోయాయి. భారతదేశ మట్టి పరిమళం, పండుగల జ్ఞాపకాలు, భక్తి గీతాల రాగాలు, పూర్వీకులు అందించిన విలువలు మీతో ఉన్నాయి. కాలక్రమేణా

2లో..

**దారిని చూపే**

# దీపం ఆరిపోతోంది..

- ప్రభుత్వ విద్య సర్వనాశనం అవుతోంది..
- ఒకప్పుడు ప్రజల ఆశ నేడు భారమైపోయింది..
- ప్రభుత్వాల పాలన వైఫల్యానికి ప్రత్యక్ష సాక్ష్యం.
- విద్య అంటే బాల బాలికల భవిష్యత్తు.
- కానీ నేటి పాలకుల దృష్టిలో విద్య అంటే అర్థం మారింది..
- బడ్జెట్ భారమై పోయింది.. నిర్లక్ష్యానికి గురైపోయింది..
- ప్రైవేటు పెట్టుబడిదారుల అడుగులకు మడుగులొత్తుతోంది..
- కార్పొరేట్ విద్యా మాఫియాల మార్కెట్ విస్తరిస్తోంది..



**- ప్రభుత్వ విద్యావ్యవస్థపై " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ " అందిస్తున్న ప్రత్యేక కథనం..**

**ప్రభుత్వ విద్యను అభివృద్ధి చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయా? లేదా అత్యంత తెలివిగా , జాగ్రత్తగా నాశనం చేస్తున్నాయా? ఇది ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చించాల్సిన ప్రశ్న. ప్రభుత్వ విద్య గురించి ఆలోచిస్తేనే ఆందోళన కలుగుతోంది.. ఒకప్పుడు మేధావులను, క్రీడాకారులను, గొప్ప గొప్ప రాజకీయ వేత్తలను, సామాజిక వేత్తలను, న్యాయమూర్తులను, సైనికులను తయారు చేసిన ప్రభుత్వ విద్య ఎందుకు దారుణంగా మారిపోయింది..? ఎవరి స్వార్ధం కోసం ఇదంతా జరుగుతోంది..? దయచేసి మేధావి వర్గం ఆలోచించాలి.. గతితప్పిన ప్రభుత్వ విద్యావ్యవస్థను గాడిలో పెట్టాలి.. లేకపోతే దేశం సర్వనాశనం అయిపోతుంది..**

**( స్పెషల్ కరస్పాండెంట్ ) హైదరాబాద్, జనవరి 01 ( భారత శక్తి ) :** పాడైపోతున్న ప్రభుత్వ పాఠశాలలు.. నిజంగా ఇది దురదృష్టం.. ఇది నిర్లక్ష్యమా? కుట్రనా? అన్న అనుమానాలు కలుగుతున్నాయి.. పాఠశాలల భవన నిర్మాణాలు శిథిలావస్థలో ఉన్నాయి. టీచర్లు లేరు. ఉన్నవారికి బోధన కంటే డ్యూటీలే ఎక్కువ. గ్రంథాలయాలు మూతపడ్డాయి. ల్యాబ్‌లు పేరుకే ఉన్నాయి. ఇవి యాదృచ్ఛికంగా జరిగిందా? లేదంటే ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల నమ్మకం తొలగించాలనే కుట్రపూరిత చర్యనా అన్నది అర్థం కావడం లేదు.ఈ విధంగా పాఠశాలలు దారుణ స్థితిలో ఉంటే.. తల్లిదండ్రులు ప్రైవేటుకు పరుగులు తీయక తప్పడం లేదు.. అదే ఈ వ్యవస్థలో అతి పెద్ద ప్లాన్.

**ప్రైవేట్, కార్పొరేట్ విద్య :**

చదువా? దోపిడీ వ్యాపారమా? అంతే ఖచ్చితంగా వ్యాపారమే అని చెప్పవచ్చు.. నేడు విద్య ఒక సేవ కాదు... లాభాల పరిశ్రమ. ఎల్‌కేజీ నుంచే వేలల్లో ఫీజులు.. యూనిఫాం, పుస్తకాలు, ట్రాన్స్‌పోర్ట్ పేరుతో దోపిడీ.. ప్రతి ఏడాది పెరుగుతున్న ఫీజులు.. తల్లిదండ్రుల జేబులతోపాటు, రక్తాన్ని కూడా ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు పీలుస్తున్నాయి.. ఇక్కడ విద్యార్థి అనేవారు ఒక కస్టమర్ గా కనిపిస్తున్నాడు.. తల్లి దండ్రులు ఆదాయ వనరులుగా మారిపోయారు.. ఈ దోపిడీపై ప్రభుత్వం ఏమి చేస్తోంది? పేరుకే చట్టాలున్నాయి... కానీ అమలు జరగడం లేదు.. ఫీజు నియంత్రణ కమిటీలున్నాయి... కానీ అవి కాగితాలకే పరిమితం అయ్యాయి.. ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాల ముందు ప్రభుత్వాలు మౌనంగా నిలుస్తున్నాయి. వారికి ఊడిగం చేస్తున్నాయి.. వారి కాళ్లకు మడుగులు

2లో..

# సంపాదకీయం

భారత శక్తి
VOICE OF INDIAN

## డాలర్ స్థానంలో బ్రిక్స్

ప్రపంచ రాజకీయాల్లో ఇప్పుడు కొత్త రకమైన 'క్యూ' కనిపిస్తోంది. ఒకప్పుడు అమెరికా డాలర్ కనిపిస్తే చాలు జోహార్లు అర్పించిన దేశాలన్నీ, ఇప్పుడు 'మాకు ఈ డాలర్ వద్దు.. బ్రిక్స్ దోస్తీ ముద్దు' అంటూ ఆ దేశాల కూటమి ముందు క్యూ కడుతున్నాయి. ఐఎంఎఫ్ తాజాగా విడుదల చేసిన ఏప్రిల్, 2026 గణాంకాలను చూస్తుంటే, ఇది కేవలం ఒక కూటమిలా కాకుండా.. అమెరికా, యూరప్ దేశాలకు నిద్రలేకుండా చేసే ఒక 'ప్రత్యామ్నాయ ప్రపంచం'లా కనిపిస్తోంది. చైనా భారీ జీడీపీ నుంచి మొదలుకొని, పాలస్తీనా వంటి చిన్న దేశాల వరకు అందరూ ఈ క్లబ్‌లో మెంబర్‌షిప్ కోసం తహతహలాడుతుండటం చూస్తుంటే.. భవిష్యత్తులో వైట్ హౌస్ కంటే 'బ్రిక్స్' ఆఫీసు ముందే రద్దీ ఎక్కువగా ఉండేలా కనిపిస్తోంది.బ్రిక్స్ సభ్య దేశాల జీడీపీ లెక్కలు చూస్తుంటే, చైనా ఏకంగా వి20.85 ట్రిలియన్లతో అందనంత ఎత్తులో కూర్చుంది. దానికి పోటీగా భారతదేశం కూడా వి4.15 ట్రిలియన్లతో తన సత్తా చాటుతోంది. ఈ రెండు దేశాలు కలిస్తేనే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సగానికి పైగా వాటా ఉండేలా ఉంది. బ్రెజిల్, రష్యా కూడా చెరో రెండున్నర ట్రిలియన్లతో తమ ఉనికిని చాటుకుంటున్నాయి. ఇక్కడ ఒక వింత ఉంది.. ఒకవైపు రష్యాపై ఇన్ని ఆంక్షలు ఉన్నా, దాని జీడీపీ మాత్రం నిలకడగా ఉండటం పాశ్చాత్య దేశాలకు మింగుడుపడని నిజం. సంక్షేమ పథకాలు, అప్పులతో కుస్తీ పడుతున్న దక్షిణాఫ్రికా, ఈజిప్ట్ వంటి దేశాలు కూడా ఈ భారీ ఇంజన్ల అండ చూసుకునే ధైర్యంగా అడుగులు వేస్తున్నాయి.ఈ జాబితాలో ఇండోనేషియా (వి1.54 ట్రిలియన్) వంటి బలమైన ఆర్థిక వ్యవస్థలు పూర్తి సభ్యులుగా మారుతుంటే, పాకిస్థాన్ (వి410 బిలియన్), శ్రీలంక (వి98 బిలియన్) వంటి దేశాలు మాత్రం దరఖాస్తు పట్టుకొని దీనంగా ఎదురుచూస్తున్నాయి. పాకిస్థాన్ పరిస్థితి చూస్తుంటే.. 'సభ్యత్వం ఇస్తే ఇయ్యండి కానీ, ముందు ఏవైనా లోన్లు ఉంటే చూడండి' అని అడిగేలా ఉంది. అప్పుల ఊబిలో ఉన్న దేశాలన్నీ బ్రిక్స్‌ను ఒక 'ఏటీఎం'లా చూస్తుంటే, అసలు సభ్య దేశాలు మాత్రం దీన్ని ఒక 'పొలిటికల్ వెపన్' (రాజకీయ ఆయుధం)లా వాడుకోవాలని ప్లాన్ చేస్తున్నాయి. ఇక సౌదీ అరేబియా లాంటి ధనిక దేశాలు కూడా చేరితే, బ్రిక్స్ దగ్గర ఆయిల్ కు, డబ్బుకు అస్సలు కొదవ ఉండదు. నైజీరియా నుంచి వియత్నాం వరకు దాదాపు 10 దేశాలు భాగస్వామ్య హోదాలో ఉంటూ లోపలికి రావడానికి గేట్ల దగ్గర వేచి చూస్తున్నాయి. వియత్నాం (వి527 బిలియన్), మలేషియా (వి516 బిలియన్) వంటి ఆగ్నేయాసియా పులులు ఈ కూటమిలో చేరితే, ఇక ఆసియా ఖండం మొత్తం బ్రిక్స్ గుప్పిట్లోకి వెళ్లడం ఖాయం. ఒకప్పుడు అభివృద్ధి చెందిన దేశాల జీ-7 (ఉ7) గ్రూపును చూసి భయపడిన ప్రపంచం, ఇప్పుడు బ్రిక్స్ ప్లస్ (బ్రిక్స్+) వైపు ఆశగా చూస్తోంది. ఈ కూటమిలో డేటా లేని క్యూబా, సిరియా వంటి దేశాలు కూడా ఉన్నాయంటే, ఇక్కడ ఆర్థిక స్థితి కంటే 'అమెరికా వ్యతిరేకత' అనే గూడు పుఠాణీనే ఎక్కువగా పనిచేస్తున్నట్లు కనిపిస్తోంది.

చిన్న దేశాల 'పెద్ద' కలలు కేవలం వి3.49 బిలియన్ల జీడీపీ ఉన్న సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ నుంచి, అంతర్యుద్ధాలతో అల్లాడుతున్న ఆఫ్ఘనిస్తాన్ వరకు అందరూ ఈ జాబితాలో ఉన్నారు. వీరందరికీ బ్రిక్స్ లో చేరడం అంటే ఏదో మంత్రదండం దొరికినట్లే అన్నంత ఆశ ఉంది. చైనా ఇచ్చే పెట్టుబడులు, భారత్ ఇచ్చే సాంకేతికత తమ దేశాలను మార్చేస్తాయని వారు నమ్ముతున్నారు. అయితే, ఇంత మంది ఒకే గూటి కింద చేరితే.. ఒకరి అభిప్రాయాలు ఒకరికి నచ్చుతాయా? లేక ఇది కేవలం ఫోటో షూట్లకే పరిమితం అవుతుందా? అన్నది భవిష్యత్తు తేల్చాలి. మొత్తానికి, బ్రిక్స్ విస్తరణ చూస్తుంటే.. 'డబ్బు ఉన్నవాడు, అప్పు ఉన్నవాడు, యుద్ధం చేస్తున్నవాడు.. అందరూ కలిశారు.

ఇక డాలర్ గారే జాగ్రత్తగా ఉండాలి' అనిపిస్తోంది. ఐఎంఎఫ్ రిపోర్ట్ ప్రకారం ఈ కూటమి ఇలాగే పెరిగితే, ఇక ప్రపంచం ఢిల్లీ-బీజింగ్ చుట్టూ తిరగడం ఖాయం!

### ప్లాస్టిక్ రహితంగా
## అన్నమయ్య జిల్లా

**రాయచోటి,** ప్లాస్టిక్ రహిత సమాజం.. ప్లాస్టిక్ రహిత జిల్లా మన లక్ష్యం కావాలని, స్వచ్ఛతను ప్రజలందరూ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ జిల్లా ప్రజలందరికీ పిలుపునిచ్చారు. శనివారం రాయచోటి పట్టణంలోని మున్సిపల్ ఆఫీస్ నుండి ఆర్టీసీ బస్టాండ్ కూడలి వరకు నిర్వహించిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీలో పారిశుద్ధ కార్మికులు, అంగన్వాడీ వర్కర్లు, ఉద్యోగులతో పాటు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పాల్గొన్నారు. స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా 'ప్లాస్టిక్ రహిత రాష్ట్రం' అనే ఇతివృత్తంతోజిల్లావ్యాప్తంగా కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతున్నదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..ప్రతి నెలా మూడవ శనివారాన్ని 'స్వచ్ఛ ఆంధ్ర డే'గా ప్రకటించినట్లు తెలిపారు. మే 2026 నెలకు సంబంధించి 'ప్లాస్టిక్ రహిత రాష్ట్రం' అనే ఇతివృత్తంతో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. దీనిలో భాగంగా జిల్లాలో ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా అరికట్టడం, ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడం మరియు వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, జిల్లా మొత్తాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చాలనేది మన దీర్ఘకాలిక లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. వ్యర్థాల నుండి సంపదను సృష్టించే 'గ్రీన్ షాప్స్' ద్వారా ప్రజలు పొడి వ్యర్థాలను ఇచ్చి నిత్యావసర వస్తువులను పొందే వినూత్న విధానాన్ని ప్రోత్సహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వ్యాపారస్తులు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని అదేవిధంగా వినియోగదారులు వస్తువులు కొనుగోలు చేయాలనుకున్నప్పుడు ఇంటి దగ్గర నుంచే బ్యాగులు తీసుకెళ్లాలన్నారు. దీంతో ప్లాస్టిక్ బ్యాగులు తిరిగి మన ఇంటికి రావని, మన పరిసరాలు అపరిశుభ్రం కావన్నారు. ప్లాస్టిక్ ను కాల్చి వేయడం వల్ల వాటి నుంచి వచ్చే రసాయనాలతో క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని మనకు ఎటువంటి చెడు వ్యసనాలు లేనప్పటికీ మనం చేస్తున్నటువంటి పనులు అపరిశుభ్రత వాతావరణం వల్ల జబ్బులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ విషయాలను ప్రతి ఒక్కరూ దృష్టిలో ఉంచుకొని ప్లాస్టిక్ నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. రాయచోటి ఆర్టీసీ బస్టాండ్ లోని పారిశుద్ధ్య పనులు, మరుగుదొడ్లు, బస్టాండ్ లోని వసతులను పరిశీలించారు. పారిశుద్ధ్య పనులు, ఇంకా మెరుగుపడాలని, వేసవికాలం దృష్టిలో ఉంచుకొని ప్రయాణికులు బస్టాండ్ ఆవరణంలో నడిచే ప్రదేశంలో గ్రీన్ మ్యాట్ ను ఏర్పాటు చేయాలని, చల్లని త్రాగునీరు, మరిన్ని ఫ్యాన్లను ఏర్పాటు చేయాలని, డస్ట్ బిన్ లను సరైన ప్రదేశాలలో ఉండేలా చూడాలని సంబంధిత అధికారులకు తగు సూచనలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా క్లాత్ బ్యాగులను పంపిణీ చేశారు. అనంతరం మానవహారంగా ఏర్పడి ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం కొరకు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, తాసిల్దార్ నరసింహ కుమార్,డిపిఓ రాధమ్మ,రాయచోటి మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి,ఆర్టీసీ డిఎం మహేశ్వర్ రెడ్డి,మున్సిపల్ సిబ్బంది, పబ్లిక్ హెల్త్ వర్కర్స్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛ ఆంధ్ర?స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం అమలుపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మదనపల్లిలోని కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పరిశుభ్రమైన పరిసరాలు, ఆరోగ్యవంతమైన జీవన విధానం, వ్యర్థాల సమర్థ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంచి, అన్నమయ్య జిల్లాను స్వచ్ఛ జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ప్రతి నెల మూడవ శనివారాన్ని ×"స్వచ్ఛ దివస్"×గా నిర్వహిస్తూ గ్రామాలు, పట్టణాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్, ఈ–వేస్ట్ మేనేజ్‌మెంట్, సిటిజన్ ఫీడ్‌బ్యాక్, స్వచ్ఛ రథం, స్వచ్ఛ పథం, మ్యాజిక్ డ్రెయిన్స్ వంటి కార్యక్రమాలను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.పట్టణాల సుందరీకరణ, పాఠశాలల నుంచి వ్యర్థాల సేకరణ, ఎస్టీపీ/ఎన్ఎస్టీపీ నిర్వహణ, అవసరమైన స్థలాల సేకరణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మదనపల్లి కమిషనర్ ప్రమీల, డీపీఓ రాధమ్మ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.జిల్లాలో వేగవంతమైన ప్రభుత్వ సేవలు, పారదర్శక సంక్షేమ పథకాల అమలుతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సేవల్లో వేగం నాణ్యత, పారదర్శకత పెంపొందించడంపై కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం, ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించడం, ప్రజా ఫిర్యాదులపై వెంటనే స్పందించడం, శాఖల పనితీరుపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి శాఖ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొని, వాటిని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు తగిన సూచనలు జారీ చేశారు.పట్టణాలు, గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ సమస్యల పరిష్కారంపై తదితర సేవలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామ సభల ద్వారా ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, ప్రజలకు సురక్షితమైన మరియు అందుబాటులో ఉన్న రవాణా సేవలు అందించడంతో పాటు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచి, పంటలపై అవగాహన కార్యక్రమాలు, సాంకేతిక సలహాలు అందిస్తూ వారికి అండగా నిలవాలని తెలిపారు.విద్యా శాఖ అధికారులు పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపు, విద్యార్థులు?ఉపాధ్యాయుల హాజరుపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. "బడి పిలుస్తోంది" కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి డ్రాపౌట్స్ తగ్గించాలని, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తీర్ణత శాతం పెంపునకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ఫలితాల మెరుగుదలకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు.


**దక్షిణ మధ్య రైల్వే**
Follow us on @SCRailwayindia
ద.మ రైల్వేలోని టెండరు ప్రకటన వివరాలను మా వెబ్‌సైట్
website : www.scr.indianrailways.gov.in

**Open e-Tender Notice No. DRM/ Works/SC/54-68/2026/OT, Dt.: 13.05.2026** PUB/246

భారత రాష్ట్రపతి తరఫున, ఈ క్రింద సంతకం చేసిన నేను, 10.06.2026 తేదీన మధ్యాహ్నం 2 గంటల వరకు క్రింది పనుల కొరకు ఈ-టెండర్‌ను ఆహ్వానిస్తున్నాను.

1.ఇ-టెండర్ నెం.: 54_CR_SC_26_OT పని పేరు: ఘన్‌పూర్ - GNP స్టేషన్‌లో ప్రస్తుతం ఉన్న నాన్-స్టాండర్డ్ FOB స్థానంలో కొత్త 3మీ వెడల్పు గల FOB (RDSO స్టాండర్డ్) ఏర్పాటు. సుమారు టెండర్ విలువ: (రూ) 2,17,19,613/- EMD: (రూ) 4,34,400/- పూర్తి చేసే కాలం (నెలల్లో): 09, నిర్వహణ కాలం నెలల్లో: 36

2. ఇ-టెండర్ నం.: 55_CR_SC_26_OT పని పేరు: SC-KZJ విభాగం: KZJ యార్డ్‌లో యార్డ్ అభివృద్ధికి సంబంధించి డైమండ్ క్రాసింగ్ (రెండు అబ్ట్యూన్ మరియు అల్పకోణ క్రాసింగ్‌లు) రూపకల్పన, తయారీ, ఏర్పాటు మరియు సరఫరా. సుమారు టెండర్ విలువ: (రూ) 4,52,78,010/ - EMD:(రూ) 9,05,600/- పూర్తి చేయడానికి పట్టే సమయం(నెలల్లో):12, నిర్వహణ కాలం నెలల్లో: 36

3. ఇ-టెండర్ నం.: 56_CR_SC_26_OT పని పేరు: SC-KZJ విభాగం: ట్రాక్ మెయింటెయినర్ల కొరకు RF- ఆధారిత సమీపించే రైలు హెచ్చరిక వ్యవస్థ (ATWS) & కంపనం ఆధారిత రైలు సమీపించే హెచ్చరిక వ్యవస్థ (ATWS - గ్రూపింగ్) కొరకు తాత్కాలిక కార్యాత్మక అవసరాల స్పెసిఫికేషన్ (FRS). సుమారు టెండర్ విలువ: (రూ) 54,12,000- EMD: (రూ) 1,08,300/- పూర్తి చేసే కాలం నెలల్లో: 03, నిర్వహణ కాలం నెలల్లో: 24

4. ఇ-టెండర్ నం.: 57_CR_SC_26_OT పని పేరు: WD-SC-KZJ విభాగం: హైదరాబాద్ - పాయింట్ నెం. 41, రోడ్ నెం. 5 మరియు 6 స్లూయింగ్, హైదరాబాద్‌లో CSR మెరుగుదల. సుమారు టెండర్ విలువ (రూ) 50,18,033/- EMD: (రూ) 1,00,400/- పూర్తి చేసే కాలం నెలల్లో: 06, నిర్వహణ నెలలలో కాల వ్యవధి:06

5. ఇ-టెండర్ నం.: 58_CR_SC_26_OT పని పేరు: SW 1) సంత్‌నగర్ ఫ్రైట్ డిపో: SNAG యార్డ్ మరియు ATC హాస్టల్ భవనంలోని మొదటి అంతస్తులో ఉన్న సర్వీస్ బిల్డింగ్‌లో వెల్డింగ్ సౌకర్యాల ఏర్పాటు. SW 2) కాజీపేట: DLS/KZJ వద్ద ఎక్స్‌ప్రెస్ బే షెడ్‌లో మార్పులు. సుమారు టెండర్ విలువ: (రూ) 1,76,67,230/ - EMD: (రూ) 3,53,400/- పూర్తి చేసే కాలం (నెలల్లో): 09, నిర్వహణ కాలం నెలల్లో: 36

6. ఇ-టెండర్ నం.: 59_CR_SC_26_OT పని పేరు: కాజీపేట: KZJ వద్ద 50 KLD సామర్థ్యం గల మురుగునీటి శుద్ధి కర్మాగారం యొక్క 3 సంవత్సరాల వార్షిక నిర్వహణ మరియు మరమ్మత్తు. సుమారు టెండర్ విలువ: (రూ) 18,87,812/- EMD: (రూ) 37,800/- పూర్తి చేసే కాలం (నెలల్లో): 36 నిర్వహణ కాలం (నెలల్లో):0

7. ఇ-టెండర్ నం.: 60_N_SC_26_OT పని పేరు: మంచిర్యాల్ - గోదావరి పుష్కరాల సమయంలో MCI వద్ద యాత్రికులకు అదనపు సౌకర్యాల కల్పన-2027. (టూ ప్యాకెట్ సిస్టమ్). సుమారు టెండర్ విలువ: (రూ) 11,54,33,208/ - EMD: (రూ) 23,08,700/- పూర్తి చేసే కాలం (నెలల్లో): 09, నిర్వహణ కాలం (నెలల్లో): 36

8. ఇ-టెండర్ నం.: 61_N_SC_26_OT పని పేరు: రామగుండం - గోదావరి పుష్కర్మ-2027 సందర్భంగా ఆర్.డి.ఎం వద్ద యాత్రికులకు అదనపు సౌకర్యాల కల్పన. సుమారు టెండర్ విలువ: (రూ) 7,07,78,529/- ఈ.ఎం.డి: (రూ) 14,15,600/- పూర్తిచేయు కాలవ్యవధి (నెలల్లో): 09, నిర్వహణ కాలవ్యవధి (నెలల్లో): 36

9. ఇ-టెండర్ నం.: 62_N_SC_26_OT పని పేరు: BPQ - MAGH మరియు MAGH GDCR సెక్షన్లు: Sr.DEN/North/9/SC సెక్షన్‌లోని Sr.DEN/ North/SC/BPA సబ్ డివిజన్ పరిధిలో BPQ MAGH -GDCR స్టేషన్ల మధ్య LC's రోడ్ల ఉపరితలం, గేట్ లాడ్జ్‌ల మెరుగుదలలు మరియు MAGH GDCR స్టేషన్ల మధ్య స్టాండర్డ్ హైట్ గేజ్‌ల ఏర్పాటు. సుమారు టెండర్ విలువ (రూ) 95,54,179/- EMD: (రూ) 1,91,100/- పూర్తి చేసే కాలం (నెలల్లో): 09 ,నిర్వహణ కాలం (నెలల్లో): 36

10. ఇ-టెండర్ నం.: 63_S_SC_26_OT పని పేరు: ADEN/S/KZJ, ADEN/DKJ & ADEN/ MDR ఉప-విభాగాల పరిధిలోని KZJ-BZA & MTMI-JPTN సెక్షన్లలో వర్షాకాలంలో ప్రస్తుతం ఉన్న RUB వంతెన ప్రదేశాల నుండి నీటిని తొలగించి, పూడికను శుభ్రపరచడం. సుమారు టెండర్ విలువ: (రూ) 1,75,05,892/- EMD: (రూ) 3,50,100/- పూర్తి చేసే కాలం (నెలల్లో): 09, నిర్వహణ కాలం (నెలల్లో): ఏమీ లేదు.

11. ఇ-టెండర్ నం.: 64_S_SC_26_OT పని పేరు: MTMI-JPTN: మోటుమర్రి మక్కపేట స్టేషన్ల మధ్య, కి.మీ 4/2-3 వద్ద ఉన్న LC నెం. 5కు బదులుగా కి.మీ 4/1-2 వద్ద, 20.40 మీటర్ల RH గర్డర్‌ను ఉపయోగించి, 1x5.50x5.00 మీటర్ల సైజు గల ప్రీకాస్ట్ RCC బాక్స్ పద్ధతిలో RUB (సబ్వే) నిర్మాణ ప్రతిపాదన. సుమారు టెండర్ విలువ: (రూ) 9,23,02,048/- EMD: (రూ) 18,46,100/- పూర్తి చేయడానికి పట్టిన కాలం (నెలల్లో): 09, నిర్వహణ కాలం నెలల్లో: 48

12. ఇ-టెండర్ నం.: 65_S_SC_26_OT పని పేరు: KZJ-BZA విభాగం నేకొండ ఇంటికన్నె స్టేషన్ల మధ్య కి.మీ 411/9-11 వద్ద, 20.40 మీటర్ల RH గర్డర్‌ను ఉపయోగించి, గాలి నెట్టే పద్ధతి ద్వారా 2 x 6.00x3.00MT + 2 x 6.00x3.00మీ పరిమాణం గల ప్రీకాస్ట్ RCC బాక్సులలో కొత్త వంతెన నెం. 539A (అదనపు వెంట్‌వే) (UP, DN & 3వ లైన్ భాగం) నిర్మాణ ప్రతిపాదన. సుమారు టెండర్ విలువ: (రూ) 8,84,35,507/- EMD: (రూ) 17,68,700/- పూర్తి చేయడానికి పట్టిన కాలం (నెలల్లో):09, నిర్వహణకాలం నెలల్లో:48

13. ఇ-టెండర్ నెం.: 66_S_SC_26_OT పని పేరు: SW 1) KZJ-KI (DN&UP) & KRA-SYI (SL) సెక్షన్లు: అనుబంధం ప్రకారం PQRS & TRT పద్ధతుల ద్వారా మొత్తం 20.352 కిలోమీటర్ల పొడవున రికూప్‌మెంట్, బ్యాలస్ట్ కుషన్‌ను 35 సెం.మీ.కు పెంచడం మరియు బ్యాలస్ట్‌ను డీప్ స్క్రీనింగ్ చేయడంతో సహా CTR(P). SW 2) KZJ-KI సెక్షన్ (DN & UP లైన్): మొత్తం మీద రికూప్‌మెంట్, బ్యాలస్ట్ కుషన్‌ను 35 సెం.మీ.కు పెంచడం మరియు బ్యాలస్ట్‌ను డీప్ స్క్రీనింగ్ చేయడంతో సహా TSR(P). సుమారుగా టెండర్ విలువ: (రూ) 3,51,77,354/- EMD: (రూ) 7,03,600/- పూర్తి చేయడానికి పట్టే కాలం నెలలు : 12, నిర్వహణ నెలలలో కాల వ్యవధి: 60 (రోజులు)

14. ఇ-టెండర్ నం.: 67_S_SC_26_OT పని పేరు: SW 1) KZJ-KI (DN&UP) సెక్షన్: CTR (P) అనుబంధం ప్రకారం PQRS & TRT పద్ధతుల ద్వారా మొత్తం 2.800 కి.మీ. పొడవున బ్యాలస్ట్ రికూప్‌మెంట్, బ్యాలస్ట్ కుషన్‌ను 35 సెం.మీ.కు పెంచడం మరియు బ్యాలస్ట్‌ను డీప్ స్క్రీనింగ్ చేయడం సహా. SW 2) KZJ-KI (DN & UP లైన్) సెక్షన్: TSR (P) ADEN/MDR అధికార పరిధిలో అనుబంధం ప్రకారం PQRS & TRT పద్ధతుల ద్వారా మొత్తం 23.200 కి.మీ. పొడవున బ్యాలస్ట్ రికూప్‌మెంట్, బ్యాలస్ట్ కుషన్‌ను 35 సెం.మీ.కు పెంచడం మరియు బ్యాలస్ట్‌ను డీప్ స్క్రీనింగ్ చేయడం సహా. సుమారు టెండర్ విలువ: (రూ) 3,13,68,200- EMD: (రూ) 6,27,400/- పూర్తి చేసే కాలం (నెలల్లో): 12 నిర్వహణ కాలం (నెలల్లో): 60 (రోజులు)

15. ఇ-టెండర్ నం.: 68_NW_SC_26_OTపని పేరు: ఖానాపూర్ (KHNP)లో టైప్-II క్వార్టర్ల నిర్మాణం - 7. సుమారు టెండర్ విలువ: (రూ) 2,67,08,426/- EMD: (రూ) 5,34,200/- పూర్తి చేసే కాలం (నెలల్లో): 12, నిర్వహణ కాలం (నెలల్లో): 36

1. టెండర్దారులు కేవలం ఇ-టెండరింగ్ ద్వారా మాత్రమే పాల్గొనాలి మరియు మాన్యువల్ ఆఫర్‌లు ఏవీ పరిగణించబడవు.
2. టెండర్ షరతులు/ఇతర వివరాలు IREPS వెబ్‌సైట్ ireps.gov.in లోని టెండర్ పత్రాలలో అందుబాటులో ఉన్నాయి, వాటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు, పాల్గొనవచ్చు మరియు ఏవైనా మార్పులు ఉంటే వాటిని వీక్షించవచ్చు.
3. టెండర్లలో పాల్గొనబోయే వారందరూ EMDని ఆన్‌లైన్ చెల్లింపులు/BG ద్వారా మాత్రమే చెల్లించవలసిందిగా కోరడమైనది.

**Sr.DEN/ కో-ఆర్డినేషన్ / సికింద్రాబాద్**



**E-Tender No.ELS/BZA-eTN-04-2026-27, Dt.: 13.05.2026** PUB/248

భారత రాష్ట్రపతి తరఫున, ఈ క్రింద సంతకం చేసిన నేను, కింది పని కొరకు 05.06.2026 తేదీన 15:00 గంటల వరకు ఇ-టెండర్‌ను ఆహ్వానిస్తున్నాను.

1. టెండర్ నెం. B/E.221/TRS/RC/577 ఇ-టెండర్ నెం. ELS-BZA-eTN-04-2026-27 తేది: 13.05.2026 పని పేరు: విజయవాడ ఎలక్ట్రిక్ లోకో షెడ్‌లోని మోటరైజ్డ్ పాయింట్ల కోసం మూడు (03) సంవత్సరాల కాలానికి వార్షిక నిర్వహణ ఒప్పందం పూర్తి చేసే కాలం: 36 నెలలు టెండర్ విలువ: (రూ) 10,78,014.96 ఇ.ఎం.డి: (రూ) 21,600/- టెండర్ పత్రం ఖర్చు: 0/- టెండర్ ముగింపు తేదీ & సమయం: 05.06.2026 15.00 గంటలు

1) పని పూర్తి పేరు, పైన పేర్కొన్న పని యొక్క సారూప్య స్వభావం, అర్హత ప్రమాణాలు మొదలైన టెండర్ షరతులు/ ఇతర వివరాలు www.ireps.gov.in వెబ్‌సైట్‌లో ప్రచురించబడిన టెండర్ పత్రాలలో అందుబాటులో ఉన్నాయి.
2) టెండర్ల గడువు ముగిసే తేదీకి ముందే, ఏవైనా టెండర్లకు సంబంధించిన మార్పులు/సవరణలను గమనించడానికి, టెండర్లు వేయబోయే వారు www.ireps.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించడమైనది.

**సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, TRS / ELS / విజయవాడ.**



**E-Tender Notice No. GNT/E.01/TrD/2026-27** PUB/250

కింది పనుల కొరకు కాంట్రాక్టర్ల నుండి ఇ-టెండర్లను 10-06-2026 తేదీన 15.30 గంటల వరకు దిగువ సంతకం చేసిన వారు ఆహ్వానిస్తున్నారు.

1. టెండర్ రిఫరెన్స్ నెం: GNT/E.01/TrD/2026-27 టెండర్ శీర్షిక: GNT డివిజన్-1. ట్రాక్ ఎత్తు పెంచడం వలన వంగిపోయిన/క్లిష్టమైన మరియు తక్కువ కాంటాక్ట్ వైర్ ఎత్తు ఉన్న OHE నిర్మాణాలను కొత్త OHE నిర్మాణంతో భర్తీ చేయడం మరియు 2. GNT డివిజన్‌లో తుప్పు పట్టిన కాంటిలివర్లు, పాతబడిన ఇన్సులేటర్లు మరియు కాంపోజిట్ ఇన్సులేటర్లను మార్చడం. సుమారు విలువ: (రూ) 5,02,24,168 రూపాయలు ఎర్నెస్ట్ మనీ డిపాజిట్: (రూ) 10,04,500/- రూపాయలు టెండర్ ఫారం ఖర్చు (తిరిగి చెల్లించబడనిది): (రూ) NIL

ఈ-బిడ్లను ఆన్‌లైన్‌లో సమర్పించడానికి చివరి తేదీ మరియు సమయం: 10-06-2026, 15.30 గంటల వరకు.

టెండర్ల స్వీకరణ గడువు తేదీని ఆ తర్వాత సెలవు దినంగా ప్రకటించినట్లయితే, టెండర్లను తదుపరి పని దినాన తెరుస్తారు.

ఏవైనా సవివరమైన సమాచారం కోసం 13-05-2026 తేదీన లేదా ఆ తర్వాత నుండి 10-06-2026 తేదీన 15:30 గంటల వరకు www.ireps.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి. తదుపరి ఏవైనా సమాచారాలు/సవరణలు కేవలం www.ireps.gov.in ఇ-పోర్టల్ ద్వారా మాత్రమే తెలియజేయబడతాయి.

**సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, టిఆర్‌డి/గుంటూరు**


## ఐఐటి తిరుపతి సమక్షంలో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ యువ సంఘం

**ఏర్పేడు** కేంద్ర ప్రభుత్వం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 6 రోజుల పాటు ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ యువ సంఘం-6 కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమాన్ని తిరుపతి ఐఐటి కళాశాల ఆధ్వర్యంలో చేపట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శనివారం ఏర్పేడులోని తిరుపతి ఐఐటి కళాశాలలో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ యువ సంఘం-6 కార్యక్రమాన్ని కళాశాల డైరెక్టర్ డా.ఏ. సత్యనారాయణతో కలసి జిల్లా కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు సంపూర్ణ అనుభవం ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ లో భాగంగా యువ సంఘం ఆరు రోజుల కార్యక్రమాన్ని తిరుపతి ఐఐటీ ఆధ్వర్యం లో ప్రారంభించుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్రకు చెందిన సుమారు యాభై మంది గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. కార్యక్రమంలో భాగంగా వారం రోజుల పాటు తిరుపతి జిల్లాలోని వివిధ విశేష ప్రాచుర్యం కలిగిన ప్రదేశాలైన తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీకాళహస్తి దేవాలయాలతో పాటు శ్రీ సిటీ పారిశ్రామిక కేంద్రం, శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రం, తిరుపతి ఎస్వీ, మహిళా విశ్వవిద్యాలయాలను సందర్శిస్తారన్నారు.

విశ్వవిద్యాలయాల సందర్శనలో భాగంగా ఇక్కడి అభివృద్ధి, విద్యా వ్యవస్థ, సంస్కృతి మొదలగు విషయాలపై పరస్పర అవగాహన పెంచుకునే అవకాశం కలుగుతుందన్నారు. వీటితో పాటు అదనంగా రెండు రోజులు అమరావతికి తీసుకువెళ్ళి రాజధాని ప్రాంతంలోని అభివృద్ధి పనులు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ నిర్మాణాలు ఎలా ఉన్నాయో కూడా వీరికి చూపించబడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూరుస్తూ ప్రతి ఏడూ నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అందులోనూ తిరుపతి ఐఐటి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించుకోవడం మంచి అవకాశంగా భావిస్తున్నామన్నారు. ఐఐటి తిరుపతి డైరెక్టర్ మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం తిరుపతి ఐఐటి ఆధ్వర్యంలో యూత్ ఇంటిగ్రేషన్ ప్రోగ్రామ్ నిర్వహించడం జరిగిందని, ఆ సమయంలో ఐఐటి అరుణాచల్ ప్రదేశ్ నుండి విద్యార్థులతో ఈ కార్యమరమ్యం నిర్వహించడం జరిగిందని, ప్రస్తుతం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం మహారాష్ట్ర నుండి వచ్చిన సుమారు 50 మంది విద్యార్థులతో నిర్వహించడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి సుమారు 50 మంది విద్యార్థులను ఎంపిక చేసి జూన్ మొదటి వారంలో మహారాష్ట్ర తీసుకువెళ్ళడం జరుగుతుందన్నారు.

దేశం నలుమూలల విద్యా వ్యవస్థ, సంస్కృతి, పరిశ్రమలు, అభివృద్ధి తదితర అంశాల పై సమగ్ర అవగాహన కల్పించడమే ధ్యేయంగా భారత ప్రధాని నరేంద్ర మోడి ఈ కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు తిరుపతి పరిసర ప్రాంతాల్లోని ఆధ్యాత్మిక, పారిశ్రామిక, విద్యా కేంద్రాలు చూపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐటి విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు


**Tender Notice No. G/E.29/ Tr./Tender Notice/09/2025-26 Dt.: 14.05.2026** PUB/251

భారత రాష్ట్రపతి తరఫున వ్యవహరిస్తున్నసీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/ట్రాక్షన్/గుంతకల్, ఈ క్రింది పనుల కోసం ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

1. టెండర్ నెం: GTL-TRD-29-eTN-27-2026-27 పని పేరు: గుంతకల్ డివిజన్ ఓహెచ్ఈ, జిపివై-కెపియు స్టేషన్ల మధ్య కి.మీ.నెం.274/ 28-75/2 వద్ద ఉన్న స్టీల్ గర్డర్స్ బ్రిడ్జ్ నెం.550 డౌన్ (10x9.14) స్థానంలో ప్రతిపాదిత పిఎస్‌సి స్లాబ్‌లను (పోస్ట్ టెన్షన్డ్) అమర్చడానికి సంబంధించిన మార్పులు మరియు (బ్రిడ్జి నెం.96 ఎక్స్-రే స్పాన్ 5X12.20మీ, 207 ఎక్స్-రే స్పాన్ 4X12.20మీ, 152 ఎక్స్-రే స్పాన్ 1X12.20మీ, 122 ఎక్స్-రే స్పాన్ 2X12.20మీ, 121 ఎక్స్-రే స్పాన్ 2X12.20మీ, 118 ఎక్స్-రే స్పాన్ 2X12.20మీ, 115 ఎక్స్-రే స్పాన్ 3X12.20మీ, 113 ఎక్స్-రే స్పాన్ 2X12.20మీ & 109 ఎక్స్-రే స్పాన్) RU-GY సెక్షన్‌లో 171/4-10 వద్ద GTL-NDL సెక్షన్ మరియు బ్రిడ్జ్ నెం.251 DN (5X14.85M) మధ్య 3X12.20మీ) (9 నెం.). సుమారు విలువ: (రూ) 73,93,346/- EMD: (రూ) 1,47,900/-

**టెండర్ల ముగింపు తేదీ & సమయం: 05.06.2026, మధ్యాహ్నం 3.00 గంటలకు**

**గమనిక:**
1. టెండర్దారులు www.ireps.gov.in నుండి టెండర్ పత్రాన్ని ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
టెండర్ దాఖలు మరియు ఇతర వివరాల కోసం http://www.ireps.gov.in లో లాగిన్ అవ్వండి. ఏవైనా సవరణలు ఉంటే అవి ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడతాయి.

**సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్,**
**A287 ట్రాక్షన్ / గుంతకల్**

మరిన్ని టెండర్ నిబంధనలు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి,
https://www.ireps.gov.in
లేదా
www.scr.indianrailways.gov.in
వెబ్‌సైట్‌ను సందర్శించండి

## ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు: సీపీ రష్మి పెరుమాళ్



**సిద్ధిపేట, మే 16 (భారత శక్తి):**జిల్లాలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు, రవాణా మరియు అన్‌లోడింగ్ ప్రక్రియలు సజావుగా సాగేందుకు జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు రష్మి పెరుమాళ్ తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐకేపీ (IKP), ప్యాక్స్ (గ్రూజూ) కొనుగోలు కేంద్రాలను నిరంతరం తనిఖీ చేస్తూ అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ధాన్యం అన్‌లోడింగ్ జరుగుతున్న రైస్ మిల్లులను కూడా పరిశీలిస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. సున్నితమైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్న కమిషనర్, రైతులు కొనుగోలు కేంద్రాలు, రవాణా మార్గాల్లో ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.ట్రాఫిక్ రద్దీ, వివాదాలు, రవాణా జాప్యాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని, రెవెన్యూ, సివిల్ సప్లైస్ తదితర శాఖలతో సమన్వయం చేసుకుంటూ భద్రతా ఏర్పాట్లు అమలు చేస్తున్నట్లు చెప్పారు.జిల్లాలోని పలు కొనుగోలు కేంద్రాలు, రవాణా మార్గాలు, రైస్ మిల్లులను స్వయంగా సందర్శించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించిన కమిషనర్, ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగేందుకు రైతులకు అన్ని విధాలా సహకారం అందించాలని అధికారులను ఆదేశించారు.ధాన్యం కొనుగోలు సీజన్ మొత్తం రైతులకు సురక్షిత వాతావరణం కల్పిస్తూ శాంతిభద్రతలను పరిరక్షించేందుకు సిద్ధిపేట పోలీసులు కట్టుబడి ఉన్నారని ఆమె స్పష్టం చేశారు.

## నిరుపేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ భరోసా

- లబ్ధిదారులకు రూ.3,07,000 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ
- దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరీ వెంకటస్వామి గౌడ్



**సిద్ధిపేట, మే 16 (భారత శక్తి):** నిరుపేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ భరోసాగా నిలుస్తోందని దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరీ వెంకటస్వామి గౌడ్ అన్నారు. శనివారం సిద్ధిపేట జిల్లా అక్బర్‌పేట భూంపల్లి మండల కేంద్రంలో మండలానికి చెందిన లబ్ధిదారులకు రూ.3,07,000 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు పాతూరీ వెంకటస్వామి గౌడ్ ఈ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు ఎంతో ఊరటనిస్తున్నదని తెలిపారు. పేదల ఆరోగ్య రక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు.దేశంలో ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకే చెందిందని, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచిన ఘనత కూడా కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం, ఆరోగ్య భద్రతకు పెద్దపీట వేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ అన్నబోయిన చంద్రశేఖర్, మండల ప్రధాన కార్యదర్శి కోనపురం బాల్ యాదవ్, ఉపసర్పంచ్ రామగల్ల స్వామి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కూతురి సుమలత, మలక్ మల్లేశం, రైతు విభాగం జిల్లా నాయకులు రెడ్డిపల్లి నరసింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాల్తే వెంకటేశం, ఎల్లన్నగారి సురేందర్ రెడ్డి, పోతారం రాజు, ఉత్తం నరేష్, బండారి ఆశా గౌడ్, ఎండి హైమద్, పాతూరి ప్రదీప్ రెడ్డి, పంజా మహేందర్, తిప్పనబోయిన స్వామి, కూతురి సుమన్, పాపని శ్రీధర్ గౌడ్, జీడిపల్లి రాములు, వడ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా వడ్ల కొనుగోళ్లు నిర్వహించాలి

- ఏఎంసి చైర్మన్ మీసం మహేందర్ యాదవ్






**సిద్ధిపేట, మే 16 (భారత శక్తి):**పారదర్శకంగా వడ్ల కొనుగోళ్లు నిర్వహించాలని ఏఎంసి చైర్మన్ మీసం మహేందర్ యాదవ్ అన్నారు. శనివారం సిద్ధిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలోని కిష్టాపూర్ గ్రామ ఐకేపీ వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు.ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి కొనుగోలు కేంద్రంలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోళ్లు ఎలాంటి రాజకీయాలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత సెంటర్ ఇన్‌చార్జులు, సీసీ, సీఏలకు ఆదేశాలు జారీ చేశారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా వేగవంతంగా కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు సందేబోయిన పర్శరాం, సీసీ వైకుంఠం, అల్లీపూర్ ఉపసర్పంచ్ కొలనుపాక శ్రీనివాస్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు ఉడుత జయంత్, సిద్ధిపేట నియోజకవర్గ ఆత్మ కమిటీ డైరెక్టర్ ఉడుత ప్రశాంత్, గ్రామస్థులు ఐలయ్య, పర్శరాములు, స్వామి, రైతులు, ఐకేపీ సీఏలు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణే దైవకార్యం

## ‘స్వచ్ఛ భారత్’ దిశగా కేంద్రం అడుగులు శుభపరిణామం

- గల్లీ నుంచి ఢిల్లీ దాకా సాగిన ప్రజా చైతన్యానికి లభించిన విజయం
- పర్యావరణ రక్షణతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం
- ప్రపంచ పర్యావరణ సంస్థ జాతీయ కార్యవర్గ సమావేశంలో తీర్మానం



**హైదరాబాద్ (ఎస్సార్ నగర్), మే 16: భారత శక్తి,** పర్యావరణాన్ని కాపాడుకోవడం అంటే దైవాన్ని, దేశాన్ని, మన దేహాన్ని కాపాడుకోవడమేనని ప్రపంచ పర్యావరణ సంస్థ స్పష్టం చేసింది. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా గల్లీ నుంచి ఢిల్లీ దాకా సంస్థ నిర్వహించిన సుదీర్ఘ ప్రజా చైతన్య కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం దిగిరావడం, సానుకూలంగా స్పందించడం శుభపరిణామమని పేర్కొంది. నగరంలోని ఎస్సార్ నగర్ లో గల ప్రపంచ పర్యావరణ సంస్థ జాతీయ కార్యాలయంలో జాతీయ ప్రధాన కార్యదర్శి నిఖిల్ సాయి కోనేటి అధ్యక్షతన జాతీయ కార్యవర్గ సమావేశం నిర్వహించారు.

### పర్యావరణమే నిజమైన సంపద: డాక్టర్ సిహెచ్. భద్ర

ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సిహెచ్. భద్ర మాట్లాడుతూ, దేశ ఆర్థికాభివృద్ధి, స్వచ్ఛభారత్ నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం పది రకాల ప్రత్యేక చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. గత 15 సంవత్సరాలుగా ప్రతి ఇంట్లో, ప్రతి ఒంట్లో ఉన్న ప్లాస్టిక్ కాలుష్యంపై ప్రపంచ పర్యావరణ సంస్థ నిరంతరం యుద్ధం చేస్తూనే ఉందన్నారు. ఈ మహా ఉద్యమానికి స్పందించి, పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపట్టిన భారతదేశ ప్రధానమంత్రికి జాతీయ కార్యవర్గం తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. స్వచ్ఛ భారత్, స్వస్థ భారత్ నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, గత 15 ఏళ్లుగా సంస్థ చేస్తున్న పోరాటాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని డాక్టర్ సిహెచ్. భద్ర పిలుపునిచ్చారు.



### పెరుగుతున్న ఉష్ణోగ్రతలు.. భవిష్యత్తుకు ముప్పు!

సంస్థ సలహాదారు గల్లా ప్రకాష్ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు రోజురోజుకూ ప్రమాదకరంగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో కాలుష్యం, ఉష్ణోగ్రతల తీవ్రత ఎక్కువవుతోందని, ఇప్పటికైనా పర్యావరణాన్ని కాపాడుకోకపోతే రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరూ తీవ్ర అనారోగ్య సమస్యల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని, మంచి ఆరోగ్యాన్ని అందించడమే మనం ఇచ్చే నిజమైన సంపద అని అభిప్రాయపడ్డారు.

### వందేళ్ల సంపూర్ణ ఆరోగ్యంపై శిక్షణ

ఈ సందర్భంగా ఆసుపత్రులు, మందుల ప్రమేయం లేకుండా 100 సంవత్సరాల పాటు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఎలా జీవించాలనే అంశంపై సంస్థ సభ్యులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.

### మహా ఉద్యమానికి ఐక్యంగా ముందడుగు

రాబోయే రోజుల్లో పర్యావరణ పరిరక్షణ కోసం ఒక మహా చైతన్య ఉద్యమాన్ని నిర్మించాలని, ఇందులో ప్రజలను, ప్రభుత్వాలను అనుసంధానం చేస్తూ అందరినీ భాగస్వాములను చేయాలని సమావేశం తీర్మానించింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పర్యావరణ పరిరక్షణ పది సూత్రాలను ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటిస్తామని ఈ సందర్భంగా సభ్యులందరూ ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో సంస్థ జాతీయ కార్యదర్శి సాగర్, సీనియర్ ఉపాధ్యక్షుడు పవన్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి క్రాంతి నాయుడు, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సాగర్ పటేల్, శ్రీనివాస్ పటేల్, జనగామ జిల్లా అధ్యక్షుడు యువరాజ్, ములుగు జిల్లా అధ్యక్షుడు బొల్లు నాగేంద్ర కుమార్, హెల్త్ విభాగం కార్యదర్శి డాక్టర్ నరేష్, పాల్వంచ పట్టణ అధ్యక్షురాలు శ్వేతా నాయుడు, మణుగూరు పట్టణ అధ్యక్షుడు సైదా నాయుడు, కార్యవర్గ సభ్యుడు రోహిత్ రెడ్డి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ రాజా సహా వివిధ జిల్లాలకు చెందిన కార్యవర్గ సభ్యులు, వాలంటీర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# లీకుల సర్కార్.. విద్యార్థుల బతుకులు అంధకారం!

- నీట్' పేపర్ లీకేజీపై యువజన కాంగ్రెస్ నిప్పులు
- మహబూబ్‌నగర్‌లో ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దహనం
- ప్రధాని, విద్యాశాఖ మంత్రి వెంటనే దిగిపోవాలి: శివంత్ రెడ్డి డిమాండ్

**మహబూబ్‌నగర్, మే 16 భారత శక్తి,** దేశంలో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. పగలు, రాత్రి కష్టపడి చదివిన విద్యార్థుల ఆశలను కేంద్ర సర్కార్ చిదిమేస్తోంది. జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) ప్రశ్నాపత్రం లీకేజీకి కారణమైన కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో యువజన కాంగ్రెస్ శ్రేణులు ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. కేంద్ర ప్రభుత్వ అసమర్థతపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్లకార్డులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు.

### పదేళ్లలో 89 లీకులు.. ఇదా మీ పాలన?: శివంత్ రెడ్డి ధ్వజం

ఈ నిరసన ప్రదర్శనకు నేతృత్వం వహించిన తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా పర్యవేక్షకుడు శివంత్ రెడ్డి కేంద్ర పాలనపై పదునైన విమర్శలతో విరుచుకుపడ్డారు."ఒక్క నీట్ లీకేజీతోనే దేశవ్యాప్తంగా 22 లక్షల మంది విద్యార్థుల బతుకులు రోడ్డున పడ్డాయి. గత పదేళ్ల మోడీ పాలనలో దేశంలో ఏకంగా 89 సార్లు ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయి. చేతగానితనం వల్ల 48 సార్లు మళ్లీ పరీక్షలు పెట్టాల్సి వచ్చింది. విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటున్న ఈ లీకుల సర్కార్ దేశ ప్రజలకు ఏం సమాధానం చెబుతుంది?" అని శివంత్ రెడ్డి నిలదీశారు.

### తక్షణమే రాజీనామా చేయాలి..

పరీక్షల నిర్వహణలో పూర్తిగా విఫలమైనందుకు బాధ్యత వహిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తమ పదవుల నుంచి తప్పుకోవాలని శివంత్ రెడ్డి డిమాండ్ చేశారు. పరీక్షల నిర్వహణ వ్యవస్థలో తక్షణమే మార్పులు తెచ్చి, పారదర్శకతను




పెంచకపోతే యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

### కదంతొక్కిన యువజన కాంగ్రెస్

ఈ ఆందోళన కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాల్గొన్న వారిలో: సంధ్య (రాష్ట్ర ప్రధాన కార్యదర్శి), అవేజ్ అహ్మద్ (మహబూబ్‌నగర్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు), సంజీవ్ రెడ్డి(జిల్లా ప్రధాన కార్యదర్శి), సల్మాన్ (మహబూబ్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు), ముస్తాక్ అలీ, సుఫియాన్(ఉపాధ్యక్షులు), శ్రీశైలం (హన్వాడ మండల అధ్యక్షుడు), రహీమ్, రఫీ (పట్టణ అధ్యక్షులు), తదితరులు కదంతొక్కారు.

## మహిళ కమిషన్ సభ్యురాలికి బీరంగూడ గ్రామ కమిటీ సన్మానం



**అమీన్ పూర్ మే 16 భారత శక్తి** మహిళ కమిషన్ సభ్యులు గా నియమితులైన బీరంగూడ గ్రామ వాసి శశికలా యాదవరెడ్డి ని బీరంగూడ గ్రామ అధ్యక్షులు అడెల్లి రవీందర్ ఆధ్వర్యంలో శాలువా కాపీ పూల బొకేతో ఘనంగా సన్మానం చేశారు. ఈసందర్భంగా బీరంగూడ గ్రామ అభివృద్ధి విషయంపై వారు చర్చించారు. పార్టీలకు అతీతంగా బీరంగూడ అభివృద్ధి కీ కలిసి కట్టుగా కృషిచద్దామని తెలిపారు. ఈసందర్భంగా శశికలా బీరంగూడ అభివృద్ధి కీ సంపూర్ణ సహకారం అందజేస్తామసని తెలిపారు. ఈకార్యక్రమంలో బీరంగూడ అధ్యక్షులు అడెల్లి రవీందర్ మాజీ కన్సిలర్ అనురుద్ రెడ్డి యాదవ రెడ్డి ప్రధాన కార్యదర్శి చిన్నా వీరేష్ ఉపాధక్షలు సత్యనారాయణ నక్కల కిష్టయ్య కోశాధికారి బంటు శివ కార్యదర్శి బంటు రమేష్ సభ్యులు ఎడ్ల అశోక్ బంటు ప్రవీణ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు

## నిరుద్యోగ ఆవేదనకు సజీవ సాక్ష్యం...

- కమలానగర్‌లో నిరుద్యోగి నడుపుతున్న "ఆస్పిరెంట్ టీ స్టాల్"




**ఎల్బీనగర్, మే 16 (భారత శక్తి):** 2023 డిసెంబర్ లో ఎన్నికల వేళ జూన్ లోపు 2 లక్షల ఉద్యోగాలిస్తామని అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం..నేటికీ నోటిఫికేషన్లు ఇవ్వకుండా కాలయాపన చేస్తోంది. దీంతో విసిగిపోయిన శంకర్ అనే నిరుద్యోగ అభ్యర్థి కమలానగర్‌లో ఏర్పాటు చేసిన "ఆస్పిరెంట్ టీ స్టాల్" ను ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సందర్శించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట గడ్డిఅన్నారం మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు కావస్తున్న ఉద్యోగాలు ఇవ్వక యువతను రోడ్డున పడేసింది. ఇప్పటికే లక్షలాదిమంది యువత ఉద్యోగాల కోసం ఎదురు చూస్తూ హైదరాబాదులో వివిధ కోచింగ్ సెంటర్లలో, ఇంటిదగ్గర అప్పులు చేసి డబ్బులు తెచ్చి ఫీజులు కట్టి కోచింగ్లు తీసుకుంటున్నారు. మరోవైపు కొంతమంది యువత క్యాటరింగ్ చేసుకుంటూ, రాపిడో, స్విగ్గి, జొమాటో లాంటి పనులు చేసుకుంటూ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. వేలాదిమంది యువత హైదరాబాదులో ప్రతిరోజు ఒక పూట తింటే మరో పూట పస్తు ఉంటూ ఉద్యోగాలు ఎప్పుడు పడతాయా, ఎప్పుడు పరీక్షలు రాసి ఉద్యోగాలు సాధిస్తామని ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు ఉద్యోగాలు సకాలంలో వేయకుంటే, జాబ్ క్యాలెండర్ ప్రకటించకుంటే యువత పరిస్థితి ఏంటని ప్రశ్నించారు.?నిరుద్యోగి శంకర్ లాంటి లక్షలాది మంది నిరుద్యోగుల పక్షాన, విద్యార్థుల హక్కుల కోసం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి నాయకత్వంలో బిఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ లోపలా, బయటా పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

# కస్తూరిపల్లి గ్రామస్తులకు ఊరట

**- విద్యుత్ సమస్యలను పరిష్కారించిన వంగ రాజేశ్వర్ రెడ్డి**
**- కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు**



**సిద్ధిపేట, మే 16 (భారత శక్తి):** సిద్ధిపేట జిల్లా చిన్నకోడూరు మండలం కస్తూరిపల్లి గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించడంతో గ్రామ ప్రజలు ఊరట వ్యక్తం చేశారు. ఇటీవల గ్రామానికి చెందిన పరామల మల్లేశం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన ఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది.ఈ ఘటనపై స్పందించిన వంగ రాజేశ్వర్ రెడ్డి గ్రామ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్య తీవ్రతను వివరించారు. ఇలాంటి ప్రమాదాలు మళ్లీ జరగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.దీనిపై స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు గ్రామంలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. అనంతరం అవసరమైన మరమ్మతులు చేపట్టి విద్యుత్ సమస్యలను పరిష్కరించారు. దీంతో గ్రామ ప్రజలు, రైతులు సంతోషం వ్యక్తం చేశారు.తమ సమస్యపై వెంటనే స్పందించి పరిష్కారం చూపించిన వంగ రాజేశ్వర్ రెడ్డి కు గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం

**- తొగుట మండల కాంగ్రెస్ నాయకులు**



**సిద్ధిపేట, మే 16 (భారత శక్తి):**సీఎం సహాయనిధి నిరుపేదలకు వరమని తొగుట మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు.సిద్దిపేట జిల్లా తొగుట మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన సిఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెరుకు శ్రీనివాస్ రెడ్డి సహకారంతో మంజూరైన రూ.1,24,500 విలువైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు.అలాగే బెజ్జనబోయిన కిష్టయ్య రూ.51,500, తుప్పతి సంపత్ రూ.32,500, బెజ్జనబోయిన భాగ్య రూ.24,000, మిద్దె మానస లకు రూ.16,500 విలువైన చెక్కులను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పంది రాజు అందజేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ నిరుపేదలకు సీఎం సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందని, తమకు సహకరించిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ బెజ్జనబోయిన ప్రవీణ్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు అనిల్, గ్రామ పార్టీ అధ్యక్షుడు బండారు రమేష్ గౌడ్, నాయకులు పంది నర్సింలు, పోతరాజు రవి, గంగోల్ల ప్రశాంత్, జంగపల్లి స్వామి, వడ్డే నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# వాదం బలపడితే వాటా దక్కుతుంది

**- బీసీ ప్రభంజనం సభకు తరలి రావాలని జాజుల పిలుపు**



**ఎల్బీనగర్, మే 16 (భారత శక్తి):**బీసీ వాదం బలపడితే జనాభా ప్రాతిపదికన బీసీలకు వాట దక్కుతుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం బీసీ ప్రభంజనం సభ సభ్యులతో ఆయన మాట్లాడుతూ, మే 24 న ఎల్బీనగర్ లో జరిగే బీసీ ప్రభంజనం సభకు రాజకీయాలకు అతీతంగా బీసీలు కదిలి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బీసీ వాదానికి మద్దతుగా ఎల్బీనగర్ ఎస్కే గార్డెన్స్ లో మే 24 న ఆదివారం ఉదయం పది గంటలకు బీసీ ప్రభంజనం సభ జరుగుతుందని ఆయన తెలిపారు. ఎల్బీనగర్ ఎన్నో సామాజిక ఉద్యమాలకు కేంద్రంగా ఉందని రాజకీయ చైతన్యం అధికంగా ఉండే ఎల్బీనగర్ లో బీసీ ప్రభంజనం జరగడం చారిత్రాత్మకంగా నిలిచిపోతుందన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో బీసీ ముద్దు బిడ్డలు శ్రీకాంత్ చారి, సిరిపురం యాదయ్యలు ప్రాణ త్యాగం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. వారి విలువైన బలిదానాల కారణంగా యావత్ తెలంగాణ వ్యాప్తంగా ఉద్యమం ఉవ్వెత్తున ఎగసి పడిందని ఆయన వివరించారు. బీసిలు కులాలు ఉప కులాలుగా చీలిపోకుండా అంతా ఒక్క తాటి పైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. జనాభాలో సుమారు అరవై శాతం నుంచి డెబ్బై శాతం ఉన్న బీసీలకు కూడా చట్టసభల్లో ఆరు శాతం కూడా లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీలకు మాదిరిగా బీసీలకు కూడా చట్టసభల్లో రిజర్వుడు స్థానాలు కేటాయించాలని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ ను కలిసిన బీసీ ప్రభంజనం కన్వీనర్ ఉప్పు సత్యనారాయణ, బీసీ ప్రభంజనం సమన్వయకర్త టియుడబ్ల్యుజె రాష్ట్ర నాయకులు జాల కిషన్ లు బీసీ ప్రభంజనం సభకు రావాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ ను ఆహ్వానించారు. ఆయనను కలిసిన వారిలో బీసీ ప్రభంజనం నాయకులతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీ కన్వీనర్ తెలంగాణ వెంకన్న కూడా ఉన్నారు.

# అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి: కళ్లెం.నవజీవన్ రెడ్డి

**హయత్ నగర్: మే 16 భారత శక్తి** ,ఓటర్ల జాబితా పక్కాగా ఉంటేనే ప్రజాస్వామ్యం బలోపేతమవుతుందని హయత్ నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. శనివారం హయత్ నగర్ మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ జానకి అధ్యక్షతన 'ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)' కార్యక్రమంపై సర్వపక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సరిదిద్దడం, పారదర్శక ఎన్నికల నిర్వహణపై వివిధ పార్టీల ప్రతినిధులు, బూత్ స్థాయి అధికారులతో (బీఎల్ఓలు) సుదీర్ఘంగా చర్చించారు.



### అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి

సమావేశంలో నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే ఈ ప్రత్యేక ముమ్మర సవరణ కార్యక్రమాన్ని అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. అర్హులైన ప్రతి పౌరుడూ ఓటర్ల జాబితాలో తమ పేర్లను సరిచూసుకునేలా క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పారదర్శకంగా ఈ ప్రక్రియ సాగాలని అధికారులను కోరారు. ఓటు హక్కు రక్షణ కోసం, హయత్ నగర్ ప్రజల ప్రయోజనాల కోసం తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు.

### అధికారుల అలసత్వం వీడాలి

జాబితాలో మార్పులు, చేర్పుల విషయంలో అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, ఎక్కడా పొరపాట్లకు తావివ్వకూడదని సమావేశంలో పలువురు నేతలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, విభాగం ప్రధాన కార్యదర్శి గోవింద చారి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# బాలల రక్షణే లక్ష్యం: మల్కాజ్‌గిరిలో పోక్సో చట్టంపై శిక్షణ

**- కేసుల పెండింగ్ 20 శాతం తగ్గింపు.. శిక్షల రేటు 14 శాతానికి పెంపు**
**- బేగంపేట్, మేడిపల్లిలలో కొత్తగా 'భరోసా' కేంద్రాల ఏర్పాటు: సీపీ సుమతి.**




**మల్కాజ్‌గిరి, మే 16 భారత శక్తి:** మహిళలు, పిల్లలపై జరిగే నేరాల దర్యాప్తులో పోలీసు అధికారులు, ఇతర విభాగాల సమన్వయాన్ని పెంపొందించడమే లక్ష్యంగా మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో రెండు రోజుల ప్రత్యేక శిక్షణా కార్యక్రమం ముగిసింది. మే 15, 16 తేదీల్లో 'పోక్సో' (బాలల లైంగిక నేరాల నిరోధక చట్టం) సమర్థవంతమైన అమలుపై ఈ సదస్సు నిర్వహించారు. చట్టంలోని ముఖ్యమైన అంశాలు, బాలల స్నేహపూర్వక దర్యాప్తు విధానాలు, బాధితుల విచారణ, న్యాయపరమైన ప్రక్రియలు, నేర నిరూపణ అంశాలపై అధికారులకు నిపుణులు అవగాహన కల్పించారు.

### బాధితుల పట్ల సున్నితంగా వ్యవహరించాలి: సీపీ

శిక్షణా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ (సీపీ) బి. సుమతి మాట్లాడుతూ.. మహిళలు, పిల్లలపై జరిగే నేరాల్లో వృత్తిపరంగా, బాధితుల పట్ల సున్నితంగా దర్యాప్తు జరపడం చాలా కీలకమని స్పష్టం చేశారు.

"దర్యాప్తు అధికారి నమోదు చేసే బాధితురాలి వాంగ్మూలం నాణ్యత, సాక్ష్యాధారాల బలాన్ని బట్టే నిందితులకు శిక్ష పడుతుంది. అందుకే కేసుల దర్యాప్తులో అత్యంత జాగ్రత్తలు వహించాలి."

**బి. సుమతి, ఐపీఎస్ (మల్కాజ్‌గిరి సీపీ)**

మహిళల భద్రత కోసం బేగంపేట్, మేడిపల్లిలలో రెండు కొత్త 'భరోసా' సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు సీపీ వెల్లడించారు.

అందరి ఉమ్మడి ప్రయత్నాల వల్ల మహిళలకు సంబంధించిన నేరాలలో శిక్షల రేటు (కన్విక్షన్ రేట్) 4.75 శాతం నుండి 14 శాతానికి పెరిగిందని, అలాగే పెండింగ్ కేసుల సంఖ్య 20 శాతం తగ్గిందని ఆమె వివరించారు.

### ఫోరెన్సిక్, మానసిక అంశాలపై అవగాహన

కార్యక్రమం రెండో రోజున వైద్య పరీక్షలు, ఫోరెన్సిక్ సాక్ష్యాలు, బాధితుల భద్రతపై ప్రత్యేక సెషన్లు నిర్వహించారు. ఉస్మానియా వైద్య కళాశాల ఫోరెన్సిక్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ సుధ మాట్లాడుతూ.. పోక్సో చట్టంలోని నిబంధనలు, ఫోరెన్సిక్ పరీక్షా విధానాలు, బాధితులకు పరిహారం అందజేసే అంశాలను కేసుల అధ్యయనంతో సహా వివరించారు.

మరో సెషన్‌లో సామాజిక కార్యకర్త మమతా రఘువీర్ మాట్లాడుతూ.. మహిళలు, పిల్లల భద్రత, లైంగిక దాడికి గురైన వారి మానసిక క్షోభ (ట్రామా) నిర్వహణ, బాధితులకు అందించాల్సిన మానసిక మద్దతుపై దిశానిర్దేశం చేశారు.చివరిగా నిర్వహించిన బహిరంగ చర్చ, ప్రశ్నోత్తరాల సమయం అధికారుల సందేహాలను నివృత్తి చేసింది. ఈ కార్యక్రమంలో మహిళా భద్రత డీసీపీ టి. ఉషారాణి, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ డాక్టర్ పి. అశోక్, షీ టీమ్స్ ఏసీపీ పి. వెంకటేశ్వర్లు, సీసీఆర్బీ ఏసీపీ జె. రమేష్ కుమార్, న్యాయ సలహాదారు కృష్ణ మోహన్, ప్రభుత్వ న్యాయవాది (పబ్లిక్ ప్రాసిక్యూటర్) చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కాలనీల్లో 'రక్షణ' వలయం!

**- మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలో 'మీ సురక్ష' బృహత్తర కార్యక్రమం ప్రారంభం - నేటి నుంచే 28 పోలీస్ స్టేషన్ల పరిధిలో ముమ్మర తనిఖీలు**
**- ఇళ్లలో పనిచేసే సిబ్బంది, కావలివారు, చోదకుల వివరాల నమోదు తప్పనిసరి - డిజిటల్ పద్ధతిలో 'హాక్ఐ ఆల్ట్రా' యాప్ ద్వారా దత్తాంశాల సేకరణ**






**హైదరాబాద్ (మల్కాజ్‌గిరి), మే 16: భారత శక్తి** నగరంలో వేగంగా విస్తరిస్తున్న నివాస ప్రాంతాలు, మారుతున్న నేరాల సరళిని అరికట్టేందుకు మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ ఒక వినూత్న ప్రజా రక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నివాస ప్రాంతాలు, రక్షిత సముదాయాలలో భద్రతను మరింత కట్టుదిట్టం చేసే లక్ష్యంతో 'మీ సురక్ష' పేరిట ఇళ్లలో పనిచేసే సహాయకులు, చోదకులు, కావలివారు, ఇతర సిబ్బంది సమగ్ర వివరాల సేకరణ, ధృవీకరణ ప్రక్రియను శనివారం అధికారికంగా ప్రారంభించారు. కమిషనరేట్ పరిధిలోని మొత్తం 28 శాంతిభద్రతల పోలీస్ స్టేషన్లలో ఒకేసారి ఈ కార్యక్రమానికి అంకురార్పణ జరిగింది.

### 550 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు:

ఈ సామాజిక రక్షణ చొరవలో భాగంగా కమిషనరేట్ వ్యాప్తంగా ఉన్న మొత్తం పోలీస్ బలగాలు రంగంలోకి దిగాయి. దాదాపు 550 ప్రాంతాల్లోని నివాస కాలనీలు, రక్షిత సముదాయాలు, బహుళ అంతస్తుల భవనాలు, మధ్య, అల్ప ఆదాయ వర్గాల గృహ సముదాయాలలో ఏకకాలంలో ఈ ధృవీకరణ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. కాలనీ సంక్షేమ సంఘాలు, నివాస సముదాయాల సంఘాలు, స్థానిక స్వచ్ఛంద కార్యకర్తల క్రియాశీలక భాగస్వామ్యంతో పోలీస్ స్టేషన్ సిబ్బంది విభాగాల వారీగా ఈ తనిఖీలు చేపట్టారు.

### ఎవరెవరి వివరాలు సేకరిస్తారంటే..?

నివాస గృహాలలో, ఇతర చోట్ల వివిధ సేవలందిస్తున్న కింది సిబ్బంది వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేస్తారు:

- ఇంటి సహాయకులు / పనిమనుషులు
- వంటమనుషులు / సేవకులు
- వ్యక్తిగత, వాహన చోదకులు (డ్రైవర్లు)
- కావలివారు / రక్షణ సిబ్బంది (వాచ్‌మెన్లు, సెక్యూరిటీ గార్డులు)
- తోటమాలి
- పర్యవేక్షకులు (కేర్‌టేకర్‌లు)

### పూర్తి డిజిటల్ విధానంలో నమోదు

సేకరించిన సమాచారాన్ని పకడ్బందీగా భద్రపరిచేందుకు పూర్తి డిజిటల్ సాంకేతికతను వాడుతున్నారు. 'హాక్ఐ ఆల్ట్రా' యాప్ ద్వారా మరియు గూగుల్ ఆధారిత అంతర్జాల స్వీయ నమోదు పత్రాల ద్వారా ఈ దత్తాంశాలను భద్రపరచనున్నారు. ప్రజలు గూగుల్ ప్లే స్టోర్ నుండి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని లేదా నేరుగా ఆన్‌లైన్ లింక్ (https://forms.gle/stsHXNERcQY5WZ8k6) ద్వారా కూడా వివరాలు సమర్పించవచ్చని పోలీసులు తెలిపారు.

**మీ సురక్ష' ప్రధాన లక్ష్యాలు:రక్షణ వలయం:**
గరంలో ఒంటరిగా ఉండే వృద్ధులు, మహిళలు, పిల్లల భద్రతను మెరుగుపరచడం.


**నేరాల నియంత్రణ:**
ఆస్తి నష్టం కలిగించే నేరాలు, వ్యవస్థీకృత నేరాలను ముందుగానే అరికట్టడం.నేర పరిశోధన:ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగినప్పుడు నిందితులను త్వరగా పట్టుకునేందుకు, నిఘా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఖచ్చితమైన దత్తాంశ వ్యవస్థను రూపొందించడం.

**పోలీస్-ప్రజా బంధం:**
అవగాహన సదస్సులు, సామాజిక సమావేశాల ద్వారా పోలీసులకు, ప్రజలకు మధ్య సమన్వయాన్ని పెంచడం.

**కమిషనర్ పిలుపు:** ఈ భద్రతా ప్రక్రియను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ పిలుపునిచ్చారు. నివాస కాలనీలు, భవన సముదాయాల సంఘాల ప్రతినిధులు తమ పరిధిలోని సిబ్బంది వివరాలను నమోదు చేయించి, తమ ప్రాంతాలను సురక్షితంగా మార్చుకోవడంలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

# కార్మిక కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే జిఎంఆర్..

## గుండెపోటుతో మరణించిన కార్మికుడి కుటుంబానికి 5 లక్షల 50 వేల రూపాయల నష్టపరిహారం అందజేత..




**పటాన్‌చెరు మే 16 భారత శక్తి** కార్మిక రంగానికి పెద్దపీటవేస్తూ వారి సంక్షేమానికి అనునిత్యం కృషి చేస్తున్న పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి మరో సారి కార్మిక రంగం పట్ల తన నిబద్ధతను చాటుకున్నారు. గుండెపోటుతో మరణించిన కాంట్రాక్ట్ కార్మికుడి కుటుంబానికి పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి మెరుగైన నష్టపరిహారం అందించి వారి కుటుంబానికి అండగా నిలిచారు. వివరాల్లోకి వెళ్తే..ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని పాశమైలారం పారిశ్రామికవాడలో గల స్మార్కో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో కాంటాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్న కృష్ణారెడ్డి (35) మూడు రోజుల క్రితం పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న సమయంలో గుండెపోటుతో మృతి చెందాడు. అత్యంత నిరుపేద కుటుంబం నేపథ్యం కలిగిన కృష్ణారెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ స్థానిక బిఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే జిఎంఆర్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జిఎంఆర్ పరిశ్రమ యాజమాన్యంతో చర్చించారు. మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలని సూచించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన పరిశ్రమ యాజమాన్యం 5 లక్షల రూపాయలు నష్టపరిహారంతో పాటు 50 వేల రూపాయలు అంత్యక్రియల ఖర్చులు భరిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు శనివారం సాయంత్రం పటాన్‌చెరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో.. ఎమ్మెల్యే జిఎంఆర్ సమక్షంలో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి నష్టపరిహారం డబ్బులను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక నేపద్యం నుండి రాజకీయాల్లోకి వచ్చిన తనకు కార్మికుల కష్టనష్టాలు తెలుసునని అన్నారు. నియోజకవర్గ పరిధిలోని కార్మిక రంగానికి ఎల్లప్పుడూ అండగా ఉంటూ వారి ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమల యాజమాన్యాలు కార్మికుల భద్రతకు పెద్దపీట వేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, ఐలా పటాన్చెరు అధ్యక్షులు సుధీర్ రెడ్డి, పాశమైలారం వైస్ చైర్మన్ రాఘవరెడ్డి, ప్రతినిధులు ఆనంద్ రెడ్డి, శ్రీనివాస్, రమేష్, రమణారెడ్డి. లక్ష్మణరావు, సురేష్. రంజిత్, సీనియర్ నాయకులు శ్రీధర్ చారి, చంద్రశేఖర్, మధు, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

# నమ్మించి..నయవంచన!

- ఇద్దరు మహిళల దారుణ హత్య - అప్పు తిరిగివ్వమని అడిగితే ప్రాణాలు తీశారు
- డబ్బులిస్తామని నమ్మించి రప్పించిన దుండగులు - హత్య చేసి మృతదేహాలను పూడ్చిపెట్టిన వైనం
- మోయినాబాద్, చేవెళ్ల ఫార్మ్‌హౌస్‌లలో ఘాతుకం - తాండూరు పోలీసుల విచారణలో గుట్టురట్టు..







**వికారాబాద్ మే 16 భారత శక్తి** తమ అవసరాల కోసం ఇద్దరి దగ్గరి బంధువుల వద్ద అప్పు తీసుకొని తిరిగి అప్పు తిరిగి ఇవ్వమని అడిగినందుకు నమ్మించి నయవంచనకు పాల్పడి ఇద్దరి మహిళలను దారుణ హత్య చేసిన సంఘటన రంగారెడ్డి జిల్లా మొయినాబాదులో చోటుచేసుకుంది. తీవ్ర కలకలం రేపిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి.వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం కాసిం పూర్ గ్రామానికి చెందిన అబేదా బేగం(60) అంగన్వాడి ఆయాగా పని చేస్తూ ఈనెల 5 వ తేదీన ఇంటి నుండి అదృశ్యమైంది. ఎక్కడ ఆచూకీ లభించక పోవడంతో ఈనెల 10న బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.అదేవిధంగా తాండూర్ పట్టణం ఇందిరమ్మ కాలనీకి చెందిన మహబూబ్ బి (58) ఈనెల 9వ తేదీన అదృశ్యమైంది. దీంతో వారి కుటుంబ సభ్యులు మహబూబ్ బీ తప్పిపోయిందని ఈనెల 10న యాలాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేర్వేరు పోలీస్ స్టేషన్లో నమోదైన మిస్సింగ్ కేసుల దర్యాప్తు చేపట్టిన తాండూరు రూరల్ పోలీసులకు తాండూరు పట్టణంలోని ఇందిరమ్మ కాలని లో నివసిస్తున్న భార్యాభర్తలు రెహమాన్ కరిమా బేగమ్ ల పై అనుమానం వచ్చింది. దీంతో తమదైన శైలిలో విచారించిన తాండూరు పోలీసులకు దిమ్మతిరిగే విషయాలు బయటపడ్డాయి. అప్పు తీసుకున్న ఇద్దరు భార్య భర్తలు రెహమాన్ (ఆటోడ్రైవర్) , కరీమా బేగం లు ముందు వేసుకున్న పథకం ప్రకారం మొయినాబాద్ ఫామ్ హౌస్ లో పనిచేస్తున్న తన బావమరిది తో కలిసి అప్పిచ్చిన ఇద్దరూ వేర్వేరు మహిళలను నమ్మించి పిలిపించి, మొయినాబాద్, చేవెళ్ల లోని వేర్వేరు ఫార్మ్‌హౌస్‌లలో దారుణంగా హత్య హత్య చేసి అక్కడే పూడ్చిపెట్టారు. ఈ జంట హత్యల కేసు రంగారెడ్డి జిల్లా పరిధిలో తీవ్ర కలకలం రేపింది. వికారాబాద్ జిల్లా తాండూరు ప్రాంతానికి చెందిన ఇద్దరు వృద్ధ మహిళలకు (60 ఏళ్ల పైబడినవారు) కొంతకాలంగా కొందరితో ఫైనాన్స్ (డబ్బుల) వ్యవహారంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే బాధితులకు రావాల్సిన డబ్బులు తిరిగి ఇచ్చేస్తామని నమ్మబలికిన నిందితులు, వారిని తాండూరు నుంచి ఇక్కడికి రప్పించారు.బాధితులు ఇక్కడికి చేరుకున్న తర్వాత నిందితులు వారిని విడివిడిగా తరలించారు. ఒక మహిళను మోయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక ఫార్మ్‌హౌస్‌లో, మరో మహిళను చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇంకొక ఫార్మ్‌హౌస్‌లో కిరాతకంగా హత్య చేశారు. అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు మృతదేహాలను ఆయా ఫార్మ్‌హౌస్‌లలోనే గుట్టుచప్పుడు కాకుండా పూడ్చిపెట్టారు. మోయినాబాద్ పరిధిలోని ఫార్మ్‌హౌస్ నుండి ఇప్పటికే ఒక మహిళ మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చేవెళ్ల పరిధిలోని ఫార్మ్‌హౌస్‌లో పూడ్చిపెట్టిన మరో వృద్ధురాలి మృతదేహాన్ని వెలికితీసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. క్లూస్ టీమ్, టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా పోలీసులు కేసును వేగవంతం చేశారు. పోలీస్ అదుపులో ముగ్గురు నిందితులు ఉన్నారు. వారిలో కరీం బేగం, రహిమాన్, మరో వ్యక్తి అదుపులో ఉన్నట్లుగా సమాచారం.

# తాండూర్ మాతా-శిశు ఆసుపత్రి నీ ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్

## - నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవు




**వికారాబాద్ మే 16 భారత శక్తి** తాండూర్ లోని మాతా-శిశు ఆసుపత్రి (ఎంసీహెచ్)ను జిల్లా అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల ఆసుపత్రిలో చోటుచేసుకున్న ఘటన నేపథ్యంలో ఆయన ఆసుపత్రి పరిస్థితులపై సమగ్రంగా ఆరా తీశారు.ఆసుపత్రి భవనం, మరుగుదొడ్లు, పారిశుధ్య పరిస్థితులు, వైద్య సేవలు, సిబ్బంది హాజరు రిజిస్టర్లు, మందుల నిల్వలు మరియు రోగులకు అందుతున్న సౌకర్యాలను అదనపు కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఆసుపత్రిలో పరిశుభ్రత లోపాలు లేదా నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు.గర్భిణీలు, చిన్నారులకు నాణ్యమైన వైద్యం అందించాలిఈ సందర్భంగా వైద్య సిబ్బందితో మాట్లాడిన ఉమాశంకర్ ప్రసాద్ గర్భిణీలు, బాలింతలు మరియు చిన్నారులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా డాక్టర్లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.రోగులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న ఆయన, అవసరమైన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు.

### "విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఖాయం"

నిబంధనలు మరియు ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టర్ హెచ్చరించారు. విధుల పట్ల అలసత్వం ప్రదర్శించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ తనిఖీలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శరత్, ఆర్ఎంఓలు అనిల్, సునీత, మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, వైద్యులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### మొయినాబాద్ ఫామ్ హౌస్లో

# ఇద్దరు మహిళల హత్య

**మోయినాబాద్**దమోయినాబాద్ లో ఒక ఫామ్ హౌజ్ లో ఇద్దరు మహిళల దారుణ హత్య ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మహిళలు రంగారెడ్డి జిల్లా చేవెళ్ల తోల్కట్ట గ్రామ సమీపంలో శవాలైన తాండూరుకు చెందిన వారుగా గుర్తించారు. వికారాబాద్ జిల్లా తాండూరులో మిస్సైయారు. తాండూరు నుండి వృద్ధ మహిళలను తీసుకువెళ్లి హైదరాబాద్ శివారు ప్రాంతమైన చేవెళ్ల నియోజకవర్గం మొయినాబాద్ మండలం తోల్కట్ట గ్రామ సమీపంలో గల ఫామ్ హౌస్ దగ్గర నిర్మానుష్య ప్రదేశంలో హత్య చేసి పూడ్చివేసారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.

### ప్లాస్లిక్ భూతాన్ని తరిమిభవితరాలకు

# ఆరోగ్యానిద్దాం

## - రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

**అమరావతి** పెనుకొండ-శ్రీసత్యసాయి మన ఇంటి నుంచి, మన గ్రామ నుంచి ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దామని, కాలుష్యాన్ని నివారించి, భావితరాలకు ఆస్తులే కాదు ఆరోగ్యాన్ని కూడా ఇద్దామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ,చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ కవర్లను,వస్తువుల వాడాకానికి దూరంగా ఉండాలని అన్నారు.చెత్త మీద పన్ను రద్దు చేసి, అదే చెత్తతో సంపద సృష్టిస్తున్న ఘనత సీఎం చంద్రబాబునాయుడిదన్నారు. పెనుకొండ పట్టణంలోని గాంధీ సర్కిల్ లో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. స్వచ్ఛంధ్ర-స్వర్ణాంధ్ర కోసం సీఎం చంద్రబాబునాయుడు రేయింబవళ్లు కృషి చేస్తున్నారన్నారు. ప్రజల ఆరోగ్యానికి, గ్రామాల్లో పరిశుభ్రతకు సీఎం చంద్రబాబు ప్రాధాన్యమిస్తూ స్వచ్ఛంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్లాస్టిక్ వినియోగంతో అటు ఆరోగ్యం, ఇటు పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటోందన్నారు. ఇళ్లోకి, గ్రామాల్లోకి ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులు రాకుండా చేయడంలో మహిళలే కీలకమన్నారు. మన భావితరాలకు ఆస్తులతో ఆరోగ్యాన్ని కూడా ఇవ్వాలని పిలుపునిచ్చారు. గత పాలకులు చెత్త మీద పన్ను వేసి, ప్రజలపై ఆర్థిక భారంగా మోపారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు అధికారంలోకి రాగానే చెత్త పన్ను రద్దు చేసి, అదే చెత్త ద్వారా సంపద సృష్టిస్తున్నారన్నారు. చెత్తతో వర్మీ కంపోస్ట్, ఇతర సేంద్రీయ ఎరువులను తయారు చేస్తున్నారన్నారు. స్వచ్ఛ రథాల ద్వారా ప్లాస్టిక్, ఇనుము, ఇతర వ్యర్థాలు సేకరించి, ప్రజలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్నారన్నారని మంత్రి సవిత తెలిపారు. ప్రజలంతా ప్లాస్టిక్ నివారణకు సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రతి షాపు వద్ద మున్సిపల్ అధికారులు ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను తెలిపే ప్లెక్సీలు, స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని మంత్రి సవిత ఆదేశించారు.

### ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన

# మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి



**కొలిమిగుండ్ల** సంజామల మండల కేంద్రంలో ఇవాళ రోడ్ల భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పర్యటించారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి స్థానిక టిడిపి నాయకులు పూలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు గురించి మంత్రి రోగులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు మంచి వైద్య సేవలు అందించాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి డాక్టర్లకు సూచించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర స్వచ్ఛంద కార్యక్రమంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో కంటే కూటమి ప్రభుత్వంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బత్తుల వెంకట ప్రతాపరెడ్డి, సురేష్ రెడ్డి, శంకర్ రెడ్డి, మంచాల మద్దిలేటి రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఇంకా తదితర నాయకులు కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

# పెట్రోల్ డీజిల్ ధరలు పెంచడంతో మోడీ మోసకారితనం రుజువయింది: సిపిఎం

**కొత్తపల్లి:** ఐదు రాష్ట్రాలఎన్నికలకు ముందు పెట్రోల్ డీజిల్ ధరలు భారతదేశంలో పెరగవని చెప్పి ఎన్నికలు అయిపోయిన వెంటనే పెట్రోల్ డీజిల్ ధరలు పెంచడంతో మోడీ మోసకారితనం రుజువైందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి యేసురత్నం కొత్తపల్లి మండల కార్యదర్శి ఎన్ స్వాములు ఆరోపించారు ప్రపంచంలోని అన్ని దేశాల్లో పెట్రోల్ ధరలు పెరుగుతుంటే మనదేశంలో పెట్రోల్ డీజిల్ పెరగలేదని ఈ దేశం బిజెపి వల్లనే అభివృద్ధి చెందుతుందని ఎన్నికల్లో ప్రచారం చేసి ఓట్లు దండుకున్న బీజేపీ ఏరు దాటక ముందు ఓడ మల్లన్న ఏడు దాటిన తర్వాత బోడి మల్లన్న అనే విధంగా ఎన్నికల అయిపోయిన మరుక్షణమే పెట్రోల్ పైన 3 రూపాయల 14 పైసలు డీజిల్ పైన 3 రూపాయల 11 పైసలు పెంచి కార్పొరేట్లకు దాసుడిని అనిరూపించుకున్నాడు అన్నారు ఇప్పటికే కమర్షియల్ గ్యాస్సిలిండర్ ధరను 3000 రూపాయలకు పైగా పెంచి బిజెపి ప్రభుత్వం మరోసారి పెట్రోల్ డీజిల్ ధరలను పెంచి దేశ ప్రజల పై ధరల భారం మోపి కార్పొరేట్లకు ప్రజల సొమ్మును దోచిపెడుతుందని ఆరోపించారు మోడీ ప్రధానమంత్రి అయిన తర్వాత మన దేశ కరెన్సీ డాలర్ తో మారకపు విలువ 95 రూపాయల 73 పైసలకు క్షీణించిందని ఇది మోడీ ప్రభుత్వం అసమర్థతకు నిదర్శనం అన్నారు ఇప్పటికే కాంప్లెక్స్ ఎరువుల ధరలు 300 రూపాయలు పెంచింది ఇప్పుడు పెట్రోల్ డీజిల్ ధరలు పెరగడం వల్ల ఎరువుల ధరలతో పాటు నిత్యవసర వస్తువుల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు ఇప్పటికైనా సబ్కా సాత్ సబ్కా వికాస్ అని చెబుతున్న నరేంద్ర మోడీ దేశ ప్రజలను మోసం చేయకుండా ప్రజలందరి సంక్షేమం కోరుకున్నట్లైతే పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలతో పాటు ఎరువుల ధరలను కూడా వెంటనే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు

## సమాధాన్ సమరోహ - 2026 ను విజయవంతం చేయండి

**పిడుగురాళ్ల** సుప్రీంకోర్టులో పెండింగ్ లో ఉన్న కేసుల నిమిత్తం దేశవ్యాప్త మధ్యవర్తిత్వ న్యాయం కోసం, సమన్వయ కార్యక్రమంలో భాగంగా పిడుగురాళ్ల పట్టణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి వారి ఆదేశానుసారం, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, గుంటూరు వారి సూచనల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రటరీ మరియు సివిల్ జడ్జి ( సీనియర్ డివిజన్ ), గుంటూరు న్యాయమూర్తి సయ్యద్ జియాఉద్దీన్, పిడుగురాళ్ల మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ వారి ఆధ్వర్యంలో సమాధాన్ సమారోహ - 2026 కార్యక్రమంను విజయవంతంగా నిర్వహించడం కోసం భారత సుప్రీంకోర్టులో కేసులు పెండింగ్ లో ఉన్న అర్హులైన కక్షిదారులు తమ వివాదాలను స్నేహపూర్వకంగా స్కరించుకోవటానికి ఇష్టపడేవారు, 2026 ఆగస్టు 21, 22, 23, తేదీలలో జరగనున్న ప్రత్యేక లోక్ అదాలత్ లో తమ కేసులను పరిశీలనకు తీసుకురావడం కోసం, ది.31-05-2026 లోపు స్థానిక పిడుగురాళ్ల పోలీస్ స్టేషన్ నందు నిర్దేశించిన గూగుల్ ఫారం ను పూర్తి చేసి తమ అంగీకారాన్ని తెలియజేయాలని, నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ యొక్క పథకాలు గురించి, న్యాయ అవగాహన సదస్సు శనివారం పిడుగురాళ్ల పోలీస్ స్టేషన్ నందు జరిగింది. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్లు వడ్లమూడి నాగార్జున, టి. ఫణికుమార్, పిడుగురాళ్ల పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీరామ్ వెంకట్రావు, యస్ ఐ దాసరి శివ నాగరాజు, అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్లు పి. హనుమంతరావు, స్టాలిన్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విజయవంతం చేసిన పారా లీగల్ వాలంటీర్లకు, పిడుగురాళ్ల పట్టణ పోలీస్ సిబ్బందికి, మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్ పర్సన్ న్యాయమూర్తి టి. ప్రవళిక కు కృతజ్ఞతలు తెలియజేశారు.

# హౌస్ లిస్టింగ్ ప్రక్రియలో అధికారులకు ప్రజలు సహకరించాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 16(భారత శక్తి):( జనగణన ప్రక్రియలో భాగమైన హౌస్ లిస్టింగ్ జాబితా తయారీకి జనగణన సిబ్బందికి, ప్రజలంతా సహకరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా కోరారు. కలెక్టర్ క్యాంపు నందు జనగణనలో భాగంగా, తన నివాసానికి సంబంధించి, హౌస్ లిస్టింగ్ ప్రక్రియను కలెక్టర్ భవేశ్ మిశ్రా పూర్తి చేసుకున్నారు. ముందుగా తాను ఆన్ లైన్ లో పూర్తి చేసుకున్న సెల్ఫ్ ఎన్యుమరేషన్ వివరాలు, జనగణన సిబ్బందికి తెలియజేశారు. ఆ వివరాల ఆధారంగా, అధికారులు కలెక్టర్ హౌస్ లిస్టింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. కలెక్టర్ నివాస గృహ హౌస్ లిస్టింగ్ ప్రక్రియ పూర్తి చేసిన వారిలో సూపర్వైజర్ బి. రాజేందర్, ఎన్యుమరేటర్ లు హిమబిందు, నాగలత, తదితరులు ఉన్నారు.


# పుస్తకాల వితరణలో అధికారులంతా భాగస్వామ్యం అవ్వాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మే 16(భారత శక్తి):పుస్తకాల వితరణలో అధికారులంతా పెద్ద ఎత్తున భాగస్వామ్యం అవ్వాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పిలుపునిచ్చారు. "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా చేపట్టిన విద్యా వారోత్సవాలను పురస్కరించుకొని చేపట్టిన పుస్తక వితరణ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా కలెక్టరేట్ లోని తన చాంబర్ లో పలు పుస్తకాలను జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్నకు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులంతా పుస్తక వితరణ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భాగస్వామ్యం అవ్వాలన్నారు. పిల్లలకు, విద్యార్థులకు ఉపయోగపడే, వివిధ అంశాలలో జిజ్ఞాస పెంపొందించేలా ఉండే పుస్తకాలను డిఈఓ కు అందించాలని అన్నారు. అధికారులు అందించిన పుస్తకాలు అన్నిటిని లైబ్రరీలకు, పాఠశాలకు అందివ్వాలని డిఈఓ కు సూచించారు.

# ముందస్తు అప్రమత్తతతో విపత్కర సమయాల్లో నష్ట నివారణ: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.



నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 16(భారత శక్తి): ముందస్తు అప్రమత్తత ద్వారానే విపత్కర సమయాల్లో నష్టపోకుండా ఉండగలుగుతామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. భవిష్యత్తులో వచ్చే విపత్తులను ఎదుర్కొనేందుకు సన్నద్ధతపై నిర్వహించనున్న మార్క్ ఎక్సర్సైజ్ వివరాలను హైదరాబాద్ నుండి కేంద్ర పర్యావరణ విపత్తు సంస్థ మినిస్ట్రీ ఆఫ్ హోం అఫైర్స్ డైరెక్టర్ నుండి మేజర్ జనరల్ సుధీర్ బేహాల్, ప్రిన్సిపల్ సెక్రటరీ రెవెన్యూ హరిచందన దాసరి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 18వ తేదీన, వై ఎస్ ఆర్ కాలనీలో విపత్కర పరిస్థితులు ఎదుర్కొనేలా మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మాక్ ఎక్సర్సైజ్ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు అంతా భాగస్వామ్యం అవ్వాలని అన్నారు. ఇటువంటి ముందస్తు సన్నద్ధత ద్వారా ప్రజల్లో విపత్కర పరిస్థితుల సమయాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై అవగాహన ఏర్పడుతుందని అన్నారు. ముందస్తు చర్యల వల్ల ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా కాపాడుకోగలుగుతామని తెలిపారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, అగ్నిమాపక శాఖ అధికారి ప్రభాకర్, సిపిఓ జీవరత్నం, డిఎంహెచ్ఓ రాజేందర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని వెంట వెంటనే గోదాములకు చేర్చాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**



నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 16(భారత శక్తి): రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని వెంట వెంటనే గోదాములకు తరలించి భద్రపరచాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సారంగాపూర్ మండలంలోని చించోలి (బి) గ్రామంలో గల గోదామును పరిశీలించారు. ధాన్యం అన్లోడ్ అవుతున్న తీరును చూశారు. అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఇప్పటివరకు గోదాములో నిల్వచేసిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. తగినంత మంది హమాలీలతో అన్లోడింగ్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసి, లారీలను వేగవంతంగా ఖాళీ చేయాలన్నారు. అన్లోడింగ్ పూర్తయిన వెంటనే లారీలు తిరిగి కొనుగోలు కేంద్రాలకు తిరిగి పంపాలని తెలిపారు. ఎక్కడ కూడా కొనుగోలు కేంద్రాలలో తూకం వేసిన ధాన్యం నిల్వ ఉండరాదని అన్నారు. ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని తెలిపారు. ఈ గోదాము పరిశీలన ప్రక్రియలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌరసరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్ తహసిల్దార్ విజయ కాంతారావు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఉజ్వల భవిష్యత్తుకు ప్రోత్సాహకాలు.. కడప విద్యా రత్నాలు

**- జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్.చెరుకూరి**



కడప, మే 16(భారత శక్తి ) : జిల్లా యంత్రాంగం అమలు చేస్తున్న "కడప విద్యా రత్నాలు" అవార్డులు విద్యార్థుల ఉన్నత చదువులు, ఉజ్వల భవిష్యత్తుకు ప్రోత్సాహాన్ని అందిస్తాయని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. కడపలోని మాధవి కన్వెన్షన్ హాలులో 2025-26 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో జిల్లా స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా విద్యాలయాలలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన టాప్ 10 విద్యార్థులకు "కడప విద్యా రత్నాలు-2026" పేరుతో జిల్లా యంత్రాంగం జ్ఞాపిక, ప్రశంసా పత్రం, సత్కారం చేసే కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తోపాటు కడప నగర కమీషనర్ హెచ్.ఎస్. భావన హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసనం, కృషి, పట్టుదల ఆశయాలకు ఈ రోజు రెక్కలు వచ్చిన రోజు అని అభివర్ణించారు. ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ ఒక్కో ప్రతిభ ఉందని, ఆశయం ఏదైనా కావచ్చని, ఆ రంగంలో నిష్ణాతులుగా ఎదిగి ప్రపంచ చరిత్రలో మన పేరు లిఖించబడాలి అన్న ఆశయంతో ముందుకు సాగాలన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం కష్టం కాదని, లక్ష్యాన్ని చేరుకోవడంలో ప్రణాళిక ప్రకారం, దృఢ సంకల్పంతో అడుగులేయలన్నారు. ఈ సందర్భంగా ఒక ముఖ్యమైన సందేశాన్ని కలెక్టర్ విద్యార్థులకు అందజేశారు. మీరు భవిష్యత్తులో ఎక్కడికి వెళ్లినా, ఏ ఉన్నత స్థాయిలో వున్నా మనకు జన్మను ఇచ్చిన తల్లిదండ్రులు, మనకు పాఠాలు నేర్పిన గురువులు, మనకు విద్యా బుద్ధులు, విజ్ఞానాన్ని అందించిన గుడిలాంటి బడిని మన జీవితంలో ఎప్పుడూ మారువకూడదని విద్యార్థులకు సూచించారు.మనం ఎప్పుడూ నిత్య విద్యార్థిని అనే భావనతో ముందుకు సాగాలన్నారు. మన ఇంటి కోసం, మన సొంతం కోసమే కాకుండా.. మనతో పాటు సమాజం కోసం కూడా పాటుపడుతూ దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలన్నారు. మనతో పాటు మన ఇల్లు, మన గ్రామం, మన జిల్లా అనే దృక్పథంతో నడవాలన్నారు. వినూత్న ఆలోచనలకు చక్కటి వేదిక మనిషి మేథస్సు అని మనిషిగా ఆ మెథను మనం కలిగి ఉన్నామంటే ఎంతో అదృష్టవంతులం అని గుర్తు చేశారు. చుట్టూ ఉన్న అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఆత్మ విశ్వాసంతో లక్ష్యం వైపు ఆడుగేస్తే లక్ష్యం చేరుకోవడం కష్టం కాదని తెలిపారు. తప్పిదాల నుండి ఎదురయ్యే అనుభవాలే చక్కటి గుణపాఠాలు నేర్పుతాయన్నారు. సమాజంలో పిల్లల భవిష్యత్తుకు కేవలం తల్లిదండ్రులు మాత్రమే కాకుండా చుట్టుపక్కల వారు కూడా సహకారం అందించాలని కోరారు.మన విజయానికి చేయుతను ఇచ్చిన వారిని భవిష్యత్తులో ఎన్నడూ మారువకూడదన్నారు. మీ లక్ష్యాలను ఎప్పుడు కూడా వెనుకంజలో నడిపించకూడదు అని సూచించారు. పిల్లల్లో ఉన్న ప్రతిభను తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల అభీష్టాన్ని గుర్తెరిగి, వారిలోని నైపుణ్యాలను వెన్ను తట్టి లేపి ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు కూడా ఏ రంగంలో తమకు ఆసక్తి ఉందో ఆ రంగంలో లక్ష్యాలను నిర్దేశించుకుని ఉన్నత శిఖరాలను అందుకోవడానికి కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. కడప నగర కమీషనర్ భావన మాట్లాడుతూ... మనం ఎదుగుతూనే మన సమాజంలో తోటి వారి ఎదుగుదలను కూడా ఆకాంక్షించే మనస్తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. సమాజంలో ఇంకనూ అభివృద్ధి చెందాల్సిన వారు ఎంతో మంది ఉన్నారని, వారి బంగారు



భవిష్యత్తుకు సహకారం అందించాలన్నారు. జిల్లాలో 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి కడప విద్యా రత్నాలుగా అత్యుత్తమ ప్రతిభ కలిగిన విద్యార్థులుగా అవార్డులు అందుకున్న వారు భవిష్యత్తులో ఉన్నత విడులతో పాటు, అత్యున్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. తల్లిదండ్రుల ఆశలను, కలలను సఫలీకృతం చేస్తున్న విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. చిన్నప్పటి నుండి కూడా ఇప్పటికే ఎన్నో లక్ష్యాలను ఛేదించి విజయాలను అందుకుని ఉంటారని అక్కడక్కడా ఎదురయ్యే ఓటములను గుణపాఠాలుగా గుర్తించి చక్కటి భవిష్య ప్రణాళికతో ప్రభుత్వం అందించే సహాయ సహకారాలను అందుకోవాలన్నారు. డీఈఓ శంశుద్దిన్ మాట్లాడుతూ కలెక్టర్ ఆధ్వర్యంలో ఒక మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన విద్యాశాఖ వారికి, అవార్డు పొందిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. మానవతా విలువలను కోల్పోకుండా సమాజాన్ని గౌరవిస్తూ సమాజం కోసం, మన తల్లిదండ్రుల కలలను సాకారం చేసే దిశగా అడుగులేయలన్నారు. అనంతరం వైఎస్ఆర్ కడప జిల్లాలో 10వ తరగతిలో టాప్ 10 ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అతిథులతో కలిసి ప్రశంసా పత్రాలు, మెడల్ లను అందజేసి సత్కరించారు. అంతకుముందుగా అవార్డు పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కార్యక్రమంలో తమ మనోభావాలను పంచుకొని ప్రతిభ గలిగిన విద్యార్థులను వెన్ను తట్టి ప్రోత్సహించడంతోపాటు, విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి పై తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంఈఓలు, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మంచి ఆలోచనతో అడుగేయాలి, నిధులకు కొరత లేదు

**- జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**

మైదుకూరు, మే 16(భారత శక్తి ): మంచి ఆలోచన, చక్కటి ప్రణాళికతో అడుగు ముందుకేయాలే గానీ జిల్లాలో అభివృద్ధి పనులకు ఏ మాత్రం నిధుల కొరత లేదని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. "జలధార జల హారతి - సాగునీటి సంరక్షణ" లో భాగంగా స్థానిక ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తోకలిసి మైదుకూరు మండలం శెట్టివారిపల్లె చెరువుకు నీరందించే పనులకు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ప్రారంభించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన గ్రామసభలో వారు ప్రసంగించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జలమే సంపద దాన్ని ఎంత పొదుపుగా వినియోగించుకుంటే అంత సంపదను సృష్టించవచ్చన్నారు. నీరు మనందరికీ సర్వస్వమని, నీటిని సంరక్షించుకోడానికే వంద రోజుల యాక్షన్ ప్లాన్ చేపట్టామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం "నీటి భద్రత-సాగు నీటి సంఘాల బాధ్యత" లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. చెరువుల పునరుద్ధరణ, నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా ఈ కార్యక్రమం చేయపట్టడం జరుగుతోందన్నారు. జిల్లా స్థాయిలో అన్ని శాఖలు సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించాలని నీటి వినియోగదారుల సంఘాలు, గ్రామపంచాయతీలు, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం ఉండాలన్నారు. ఇప్పటికే అన్ని మండలాల్లో చక్కటి ప్రణాళికలతో జలాధార కార్యక్రమం ద్వారా భూగర్భజలాలను సంరక్షించి సాగునీటి కొరతను తీర్చే పనులు జరుగుతున్నాయన్నారు.జలాధార కార్యక్రమంలో భాగంగా ముదిరెడ్డిపల్లె అభివృద్ధికి రణాళికలు సిద్ధం చేయడంతో అటు శెట్టివారిపల్లె చెరువుకు ఎస్.ఆర్. - 1, 2 కాలువల అనుసంధానం చేసే ప్రక్రియను ప్రారంభించడం జరిగిందన్నారు.

ఈ చెరువుకు నీరందితే ఆయకట్టు ప్రాంత రైతులకు ఎలాంటి సాగునీటి కష్టాలు వుండవన్నారు. రైతు ఆలోచనా విధానంలో మార్పు రావాలని సూచించారు. రైతు ఆలోచనలో మార్పు వస్తేనే లాభాల బాటలో నడవగలడన్నారు. రైతులకు వెన్నుదన్నుగా ఉంటూ ఆదాయంలో స్థిరత్వాన్ని అందించేవి ఉద్యాన పంటలే అన్నారు. అధిక తక్కువ నీటి ఖర్చుతో అధిక దీర్ఘకాలిక ఆదాయాన్నిచ్చే ఉద్యాన పంటల సాగుపై మొగ్గుచూపాలన్నారు. విద్యా విషయానికి వస్తే ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా చక్కటి ఫలితాలను అందిస్తున్నాయన్నారు రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్ర విద్యా శాఖ మంత్రి వారి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ విద్యాలయాలు అత్యున్నతమైన విద్యనందిస్తూ విద్యార్థులు బంగారు భవిష్యత్తులకు బాటలు వేస్తున్నాయన్నారు. కార్పొరేట్ పాఠశాలల్లో అధిక డబ్బులు వెచ్చించి నష్టపోకుండా స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఇటీవల పదవ తరగతి పరీక్షల్లో గ్రామానికి చెందిన ఉదయశ్రీ జిల్లాలో ద్వితీయ స్థానం సంపాదించి జిల్లాకే గర్వకారణంగా నిలవడం అభినందనీయమన్నారు. ఇలాంటి విద్యా రత్నాలు ప్రభుత్వ పాఠశాలలో ఉండడం గర్వించదగ్గ విషయమన్నారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ వారి సూచనలు జిల్లాకు చక్కటిసీజన్లకు అనుగుణంగా, కాలానికి అనుగుణంగా పంటలను మార్పు చేసుకోవాలన్నారు. చెరువులు గ్రామాల సహజ సంపద అని చెరువులలో నీరు గ్రామంలో ప్రతి ఒక్కరి స్థిరఆస్తి అన్నారు. ప్రతి గ్రామంలోను రైతులు, వారి జలఆధారం, వారి పంటల సాగు, నీటి వినియోగంపై దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా మైదుకూరు నియోజకవర్గంలో చేపట్టే ప్రతి అభివృద్ధి కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ గారి ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. జిల్లాలో వినూత్న



ఆలోచనలతో సరికొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టడం ఆయన ప్రత్యేకత అన్నారు. జిల్లాలో చేయపట్టిన స్మార్ట్ కిచెన్ వ్యవస్థకు రాష్ట్రములోని కాకుండా జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందన్నారు. మన ప్రాంతంలో చెరువులు, సాగునీటి కాలువలు, తదితర అన్ని రకాల ఇరిగేషన్ పనుల అభివృద్ధికి జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ ముందుందన్నారు. కార్యక్రమంలో 10వ తరగతి పరీక్షల ఫలితాల్లో జిల్లాలో ద్వితీయ స్థానం సంపాదించిన శెట్టి వారి పల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని జిల్లా కలెక్టర్ సత్కరించారు. అంతకుముందు ముదిరెడ్డిపల్లెలో నూతనంగా నిర్మించిన రామలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్, ముద్దైరెడ్డిపల్లె చెరువును పరిశీలించి చెరువులో అభివృద్ధికి సంబంధించి పనుల ప్రణాళికల గురించి అధికారులతో మాట్లాడారు.ఈ కార్యక్రమంలో బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్, డ్వామా, డీఆర్డీఏ పిడీలు అదిశేషారెడ్డి, రాజ్యలక్ష్మి, స్థానిక నాయకులు, సాగునీటి సంఘాల సభ్యులు, ఇరిగేషన్ అధికారులు, మరియు పెద్ద సంఖ్యలో రైతులు, పొదుపు సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 16 ( భారత శక్తి ): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం నిర్వహణలో భాగంగా ప్రజల సౌకర్యార్థం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా జూన్ 15వ తేదీ నుండి 24వ తేదీ వరకు సన్నాహక, శిక్షణ, ముద్రణ కార్యక్రమాలు, జూన్ 25వ తేదీ నుండి జూలై 24వ తేదీ వరకు బూత్ స్థాయి అధికారుల ఇంటింటి సందర్శన, జూలై 24వ తేదీన పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, 31వ తేదీన ముసాయిదా జాబితా ప్రచురణ నిర్వహించడం జరుగుతుందని. జూలై 31వ తేదీ నుండి ఆగస్టు 30వ తేదీ వరకు ఫిర్యాదులు, అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందని, సెప్టెంబర్ 28వ తేదీ వరకు ఫిర్యాదులు, అభ్యంతరాల పరిష్కారం ప్రక్రియ తరువాత అక్టోబర్ 1వ తేదీన తుది జాబితా ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో ప్రజల సౌకర్యం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, పని దినాలలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుందని, సందేహాలు, సమాచారం కొరకు కంట్రోల్ రూమ్ నం.08736-250501 లో సంప్రదించవచ్చని తెలిపారు.

# టియుడబ్ల్యూజే ఐజేయు మహాసభలను జయప్రదం చేయండి

**పోస్టర్ ఆవిష్కరించిన మహాసభ కమిటీ సభ్యులు**



కొత్తగూడెం, మే 16 (భారతశక్తి) : కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్ లో ఈ నెల 24న జరగనున్న టియుడబ్ల్యూజే ఐజేయు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 3మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ పోస్టర్ ఆవిష్కరించారు. మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను ఐజేయు జిల్లా అధ్యక్షులు ఇమంది ఉదయ్ కుమార్, ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యులు దుద్దుకూరి రామారావు కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న టియుడబ్ల్యూజే ఐజేయు యూనియన్ 3వ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని జర్నలిస్ట్ లకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు యెర్రా ఈశ్వర్, ఎర్పుల సుధాకర్, బాపట్ల మురళి, భాస్కర్, షేక్ జానీ, బండ్ల వెంకట్, ఆర్ఎస్ రామానుజం, గుణ సురేష్, దశరద్ రజ్వా, అఫ్జల్ పఠాన్ తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి అక్రమాలు చేస్తున్న రేగొండ తహసీల్దార్ పై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు

## బిఆర్ఎస్ నాయకులు కోలెపాక బిక్షపతి

రేగొండ, మే 16 (భారత్ శక్తి): భూమి అక్రమంగా వేరే వారు నా భూమి పట్టా చేసుకున్న కారణంగా గత రెండు సంవత్సరాల క్రితం అప్పటి కలెక్టర్ భవిష్ మిశ్రా ఆదేశాలతో 12.12.2024 సంవత్సరంలో ఇప్పుడున్న తాసిల్దార్ శ్వేతా రావు,అప్పుడున్న రెవెన్యూ ఇన్స్పెక్టర్ నరేష్, మండల సర్వేయర్ తిరుపతి, వీఆర్ఏ శ్రీకాంత్ ను మా భూమి వద్దకు పంపి చుట్టుపక్కల రైతుల వాంగ్మూలం తీసుకొని మోకా పంచనామా చేసినారు. ఆర్ ఐ నరేష్ తాసిల్దార్ శ్వేతా రావు కి రిపోర్టు సబ్మిషన్ చేశారు. తహసీల్దారు ఎన్నిసార్లు పంచనామా రిపోర్ట్ కావాలని అడిగినా గాని ఆర్ ఐ రిపోర్టు ఇవ్వలేదు.నేను మీకు పంచనా రిపోర్ట్ ఇవ్వలేను, ఇవ్వాలంటే ఖర్చయితది మాకు కూడా ఖర్చులు ఉంటాయి కదా డబ్బుల కొరకు రిపోర్టు ఇవ్వాకుంట కాలయాపన చేశారు. రేగొండ తాసిల్దార్ ఆఫీస్ లో ఎలాంటి పనికైనా కొన్ని రేట్లు ఫిక్స్ చేసి తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నారని ఆరోపణలు ఉన్నాయని, తాసిల్దార్ పై ఎంక్వయిరీ చేసి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు.

# జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాలు

## - జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి



కడప, మే 16(భారత శక్తి ) : వైఎస్సార్ కడప జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ఎన్నికల కమీషన్ నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ 5 నుంచి 14 వరకు సిబ్బందికి శిక్షణ, ముద్రణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జూన్ 15 నుంచి జూలై 14 వరకు బీఎల్ఓలు ఇంటింటి సర్వే చేపడతారని తెలిపారు. జూలై 21న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు చెప్పారు.అలాగే జూలై 21 నుంచి ఆగస్టు 20 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ జరుగుతుందని, సెప్టెంబర్ 18 వరకు వాటి పరిష్కారం పూర్తి చేస్తామని వెల్లడించారు. తుది ఓటరు జాబితాను సెప్టెంబర్ 22న ప్రచురిస్తామని తెలిపారు.అర్హత తేదీల ప్రకారం 01-07-2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న యువత ఓటరు నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో సూచించారు.

# మద్యం సేవించి వాహనాలు నడపొద్దు




నిజామాబాద్,మే 16(భారత శక్తి ): మన ఊరు మన భద్రత మన బాధ్యత కార్యక్రమం లో భాగంగా ఏర్గట్ల మండలంలోని బట్టాపూర్ గ్రామపంచాయతీలో స్థానిక యువకులు గ్రామస్తులతో ఎస్సై శ్రీనివాస్ సమావేశం నిర్వహించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సైబర్ నేరాలు, డిజిటల్ మోసాలు, రోడ్డు భద్రత, డ్రంక్ అండ్ డ్రైవ్, ఆన్లైన్ గేమ్స్ మోసాలు, మైనర్ డ్రైవింగ్ లాంటి అంశాలపై అవగాహన కల్పిస్తూ జాగ్రత్తగా ఉండాలని ఎస్సై సూచించారు. ప్రయాణం చేసేటప్పుడు మద్యం సేవించరాదని, మైనర్లకు వాహనం ఇవ్వరాదని, హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉపసర్పంచ్ మూడు దయానంద్ వీడిసి సభ్యులు మహిపాల్ రెడ్డి, గద్దల ముత్తెన్న, యుగేందర్, గ్రామస్తులు,యువకులు, హెడ్ కానిస్టేబుల్ సదసీవ్, కానిస్టేబుళ్లు వినయ్, సుమన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మిద్దపల్లిలో మన ఊరు మన భద్రత మన బాధ్యత కార్యక్రమం

ఆర్మూర్, భారత శక్తి న్యూస్, మే 16: ఆలూరు మండలం మిర్ధపల్లి విలేజ్ లో మన ఊరు మన భద్రత మన బాధ్యత అనే ప్రోగ్రాం ను ఆర్మూర్ ఎస్హెచ్ఓ సత్యనారాయణ గౌడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ట్రాఫిక్ నియమాల గురించి ,మత్తు పదార్థాల గురించి ,మరియు సైబర్ నేరాల కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యాల్ల సాయ రెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ మహిళా సంఘ సభ్యులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం.

## -వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దాం

## -రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బండి పరిమళ జ్యోతి



భారతశక్తి ప్రతినిధి, కడప,మే 16 : తల్లిదండ్రులు తమ బిడ్డలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించి నాణ్యమైన విద్యను, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిపుచ్చుకొని విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పరిమళ జ్యోతి విజ్ఞప్తి చేశారు. కాశి నాయన మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రెడ్డి కొట్టాల నందు ఉపాధ్యాయులతో కలిసి బడి ఈడు పిల్లల ఇళ్ల వద్దకు వెళ్లి విద్యార్థులను ఊరి బడికి పంపాలని ప్రభుత్వ పాఠశాల గొప్పతనం గురించి పరిమళ జ్యోతి రాసిన , పాడిన ప్రచార గీతం ను రెడ్డి కొట్టాల గ్రామస్తులందరికీ వినిపిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిమళ జ్యోతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ స్కూల్ కు దీటుగా నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, అనుభవం గల ఉపాధ్యాయులు ఉన్నారని ఐ.ఎఫ్.పి ప్యానెల్స్, డిజిటల్ బోధన, ఎఫ్ ఎల్ ఎన్ కార్యక్రమాలు వంటి విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయన్నారు. పేదింటి బిడ్డలను ప్రభుత్వ పాఠశాలకు పంపితే ఆ విద్యార్థికి అవసరమైన అన్ని సౌకర్యాలు ప్రభుత్వమే కల్పిస్తుందన్నారు. అమ్మలాంటి శిక్షణ, నాన్న లాంటి రక్షణ మన ప్రభుత్వ బడులలోనే దొరుకుతుంది. పదవ తరగతి ఫలితాలలో పరిమళ జ్యోతి వద్ద విద్యను అభ్యసించిన పంగా భవ్య శ్రీ 590 మార్కులు సాధించి పోరుమామిళ్ల పట్టణంలో రెండవ స్థానాన్ని, కేతగాని నవ్య శ్రీ పోరుమామిళ్ల కస్తూర్బా గాంధీ పాఠశాలలో టాపర్ గా నిలవడం సగర్వంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను ప్రతిరోజు బడికి పంపించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని పరిమళ జ్యోతి పిలుపునిచ్చారు. రెడ్డి కొట్టాల గ్రామంలోని తల్లిదండ్రులు ప్రవేటు పాఠశాలలకు పంపే తమ విద్యార్థులను ఊరి బడిలో చేర్పించడానికి ముందుకు వచ్చారు.

# రూ.15 కోట్ల అభివృద్ధి పనులకు నేడు శంకుస్థాపన

## -గుమ్మడిదలలో మంత్రులు వివేక్ వెంకటస్వామి, దామోదర్ రాజనర్సింహ పర్యటన

## -కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు

గుమ్మడిదల మున్సిపల్, మే16 (భారత శక్తి న్యూస్): సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల కేంద్రంలో నేడు ,జిల్లా ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ రూ.15 కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నట్లు గుమ్మడిదల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పుట్ట నర్సింగరావు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేస్తూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన దిశగా వేగంగా ముందుకు సాగుతోందన్నారు. గుమ్మడిదల మండల పరిధిలో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాలు, ఆరోగ్య సేవలు, ఇతర ప్రజా అవసరాలకు సంబంధించిన పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ పనుల ద్వారా మండల ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు.మంత్రి పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటికే విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళా కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పుట్ట నర్సింగరావు కోరారు. పార్టీ కార్యకర్తలు సకాలంలో కార్యక్రమ ప్రాంగణానికి చేరుకొని ఏర్పాట్లలో భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, గుమ్మడిదల మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు ఇప్ప పెంటారెడ్డి, కౌన్సిలర్ మూడు చింతల నరేందర్ రెడ్డి, జైపాల్ రెడ్డి,మాజీ మండల అధ్యక్షుడు మద్ది వీరారెడ్డి, జయశంకర్ గౌడ్, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ మద్ది



ప్రతాపరెడ్డి, మాజీ ఎంపీటీసీ గోవర్ధన్ గౌడ్, నాయకులు ఆకుల ఆంజనేయులు, తుడుం శ్రీనివాస్, కుమ్మరి వెంకటేష్, దోమడుగు కృష్ణ, కానుకుంటా గ్రామ అధ్యక్షుడు అంజత్ భాష, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కడప మెగా సోలార్ పార్క్ పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

## - జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప, మే 15 (భారత శక్తి ): కడప అల్ట్రా మెగా సోలార్ పార్క్ (1000 మెగావాట్లు) పరిధిలో స్థానిక ప్రాంత అభివృద్ధి నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ప్రయోజనం చేకూర్చాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన "4వ స్థానిక ప్రాంత అభివృద్ధి కమిటీ" సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సోలార్ పార్క్ పరిధిలో ప్రభావిత గ్రామాలు, ప్రభావితం కాని గ్రామాల అభివృద్ధికి ఇప్పటివరకు అందుబాటులోకి వచ్చిన నిధులతో చేపట్టిన పలు రకాల పనులు అమలులో ఉన్నాయని పేర్కొన్నారు. ఇంకా అదనంగా ఉన్న నిధులతో గ్రామాల అవసరాలకు అనుగుణంగా సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు.పూర్తయిన పనులకు సంబంధించిన వినియోగ ధృవపత్రాలు (యు సి లు) వెంటనే సమర్పించాలని అమలు సంస్థలను కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటివరకు విడుదల చేసిన నిధులకు సంబంధించి పనుల పురోగతి, నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పనులు పూర్తయిన వెంటనే యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పించడం ద్వారా తదుపరి నిధుల విడుదల సులభతరం అవుతుందని చెప్పారు.మంజూరైన నిధులతో గ్రామ సచివాలయ సముదాయాల అభివృద్ధి, సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్లు, కాంపౌండ్ వాల్లు, పార్కింగ్ టైల్స్, ప్లేగ్రౌండ్ లెవలింగ్, వెటర్నరీ భవనాల అభివృద్ధి వంటి పనులను చేపట్టేందుకు కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరే పనులను మాత్రమే ఎంపిక చేస్తున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా రహదారులు, తాగునీరు, గ్రామ సచివాలయాలు, కమ్యూనిటీ భవనాలు, ఆరోగ్య సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు.సోలార్ ప్రాజెక్టు పరిధిలోని గ్రామాలకు స్థానిక ప్రాంత అభివృద్ధి నిధులతో సమాజానికి అవసరమయ్యే అభివృద్ధి పనుల కోసం డెవెలపర్స్ నుండి సహకారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగా స్మార్ట్ కిచెన్ వ్యవస్థ కోసం 4 ఫుడ్ డెలివరీ ట్రక్కులు, స్కిల్ డెవెలప్మెంట్ భవనాన్ని నిర్మించేందుకు ఆయా కంపెనీలు ముందుకొచ్చాయన్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ప్రతిపాదించిన పలు కొత్త అభివృద్ధి పనుల ప్రతిపాదనలు కూడా సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. ప్రభావిత గ్రామాలు, ప్రభావితం కాని గ్రామాల వారీగా ప్రతిపాదనలను పరిశీలించి కమిటీ ఆమోదం కోసం ఉంచినట్లు వెల్లడించారు.సోలార్ పార్క్ పరిధిలోని గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా పారదర్శకంగా నిధులను వినియోగిస్తామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సోలార్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎస్ఈ ఎం. శివశంకర్ నాయుడు, సీనియర్ ఇంజనీర్/సివిల్ అశోక్ కుమార్, సీపీవో హాజరతయ్య, సోలార్ ప్రాజెక్టు డెవలపర్స్, తదితరులు పాల్గొన్నారు.



# న్యాయ చైతన్య సదస్సు

## -మానవ అక్రమ రవాణా, పోక్సో చట్టాలపై అవగాహన

## -పాల్గొన్న మెజిస్ట్రేట్ సూరి రెడ్డి



మణుగూరు, మే 16 (భారతశక్తి) : మండల లీగల్ ఎయిడ్ అథారిటీ ఆధ్వర్యంలో మణుగూరు కోర్ట్ ఆవరణలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల లీగల్ అథారిటీ చైర్మన్, ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కంబపు సూరిరెడ్డి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా, వాణిజ్య దోపిడీ నిరోధక పథకం-2015 కింద బాధితులకు అందే న్యాయ సహాయం, రక్షణ చర్యలు, ప్రభుత్వ పునరావాస అవకాశాలను వివరించారు. అలాగే జాగృతి పథకం-2025లో భాగంగా సురక్షిత్ బచ్పన్ - సురక్షిత్ భవిష్య కార్యక్రమం ద్వారా చిన్నారుల రక్షణ, పోక్సో చట్టం నిబంధనలు, బాలల హక్కుల పరిరక్షణపై కక్షిదారులకు అవగాహన కల్పించారు.

లీగల్ ఎయిడ్ కౌన్సిల్ న్యాయవాది వీరంకి పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో పలువురు న్యాయవాదులు వివిధ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించి సూచనలు అందించారు. ప్రజలు తమ హక్కుల పరిరక్షణకు చట్టాలను తెలుసుకుని అవసరమైనప్పుడు లీగల్ ఎయిడ్ సేవలను వినియోగించుకోవాలని లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పద్మావతి సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గురు కృష్ణ, న్యాయవాదులు కందిమల్ల నరసింహారావు, జాడి చొక్కారావు, కుర్మ విజయ్, మేదరమెట్ల శ్రీనివాసరావు, రామ్మోహన్ రావు, ఈర్ల రాము, పోశం భాస్కర్, బిక్కసాని శ్రీనివాస్, బొంతు సునీత, తాటి వందన, వాసవి, లీగల్ సెల్ కోఆర్డినేటర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ పశువుల రవాణాపై పటిష్ట నిఘా కొనసాగుతోంది

## - మంచిర్యాల డీసీపీ



మంచిర్యాల జిల్లా ప్రతినిది, మే 16 ( భారత శక్తి) : బక్రీద్ పండుగ నేపథ్యంలో అక్రమ పశువుల రవాణాను అరికట్టడంతో పాటు శాంతిభద్రతలను పరిరక్షించేందుకు మంచిర్యాల జోన్‌లో గూడెం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్ ఆకస్మికంగా తనిఖీ చేసి వాహనాల తనిఖీలను పర్యవేక్షించారు.చెక్‌పోస్టుల వద్ద అమలులో ఉన్న భద్రతా చర్యలను పరిశీలించిన డీసీపీ, విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందికి పలు సూచనలు,ఆదేశాలు జారీ చేశారు.పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని,సంబంధిత పత్రాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించాలని ఆదేశించారు.ప్రతి వాహనానికి సంబంధించిన వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు.అక్రమ పశువుల రవాణాపై పటిష్ట నిఘా కొనసాగుతోందని, నిబంధనలకు విరుద్ధంగా జరిగే రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని,అనుమానాస్పద రవాణా గమనించినట్లయితే స్థానిక పోలీసులకు లేదా 100 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.విధి నిర్వహణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో మరింత జాగ్రత్తలు తీసుకోవాలని,భద్రతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు.డీసీపీ వెంట మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్, లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి,ఎస్సై సురేష్,దండేపల్లి ఎస్సై తైసినోద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసులో నలుగురికి జీవితఖైదు

## -తీర్పు వెల్లడించిన హుజూర్నగర్ కోర్ట్

సూర్యాపేట, భారత శక్తి జిల్లా ప్రతినిధి,మే 16: 2016 సం. ఏప్రిల్ నెలలో లో మెళ్లచెరువు మండలం రామాపురం గ్రామాల్లో యువకున్ని హత్య చేసిన ఘటన కేసులో నలుగురు నిందితులు నేరానికి పాల్పడ్డారని హుజూర్నగర్ కోర్ట్ నలుగురు నిందితులను నేరస్తులుగా నిర్ధారించి జీవిత ఖైదు శిక్ష విధించడం జరిగిందని జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. 2016 సంవత్సరం ఏప్రిల్ నెల లో మెళ్ళచెరువు మండలం రామాపురం గ్రామానికి చెందిన చట్లా వెంకటేశ్వర్లు 21 సంవత్సరాల యువకున్ని అదే గ్రామానికి చెందిన యువకులు ఏ1 రెడపంగు కోటేశ్వరరావు, ఏ2 రెడపంగు శ్రీహరి, ఏ3 పరిమి మహేష్, ఏ4 కొత్తపల్లి నాగ సైదులు మత్తు టాబ్లెట్ వేసి వైరుతో గొంతు నులిమి ఊపిరాడ కుండా చేసి హత్యచేసి, క్వారీలో వేసి పురుగులమందు పోసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. దీనిపై మృతుని తండ్రి లక్ష్మీపతి పిర్యాదు మేరకు మెల్లచేరువు పోలీస్ స్టేషన్ నందు అనుమానాస్పద కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా హత్యకేసుగా మార్పు చేసి అప్పటి దర్యాప్తు అధికారి కోదాడ రూరల్ సీఐ చేసి దర్యాప్తు చేసి నిందితులు హత్య చేసినట్లు నేర అభియోగం పత్రాలు కోర్టుకు దాఖలు చేసినారు.

ఈ కేసు నందు హుజూర్నగర్ కోర్టు న్యాయమూర్తి 21 మంది సాక్షులను, బాధితులను విచారించి ఆధారాలు పరిశీలించిన హుజూర్నగర్ కోర్టు నిందితులు నలుగురు నేరానికి పాల్పడినట్లు నిర్ధారించి జీవిత ఖైదీ జైలు శిక్ష మరియు జరిమానా విధించడం జరిగింది. ఈ యొక్క కేసు నందు ప్రాసిక్యూషన్ తరపున జూజూ కోటి రెడ్డి కేసును వాదించినారు. అందుకు హెడ్ కానిస్టేబుల్ వెంకట్ రెడ్డి జణా, కోర్టు డ్యూటీ లైజన్ అధికారి శ్రీకాంత్ సహకరించినారు. కోదాడ డివిజన్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, మేళ్లచెరువు ఎస్ఐ కేసు వాదనను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేశారు.

# గంజాయ్ రహిత జిల్లానే లక్ష్యం

-నార్కోటిక్ జాగిలాలతో ముమ్మర తనిఖీలు.

-పాన్ షాపులు, బస్టాండ్ పరిసరాల్లో పోలీసుల సోదాలు.

-సమాచారం ఇస్తే వివరాలు గోప్యం.





రాజన్న సిరిసిల్ల (భారత శక్తి)మే 16:జిల్లాలో గంజాయి సరఫరా, వినియోగాన్ని పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా పోలీస్ శాఖ కఠిన చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు శనివారం సిరిసిల్ల, తంగళ్లపల్లి ప్రాంతాల్లోని కిరాణా, పాన్ షాప్‌లతో పాటు బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో నార్కోటిక్ డాగ్ జాగిలం సహాయంతో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ..యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనుమానాస్పద ప్రాంతాల్లో తరచూ ఇలాంటి ముమ్మర సోదాలు ఉంటాయని స్పష్టం చేశారు. కేవలం తనిఖీలే కాకుండా, వినూత్న కార్యక్రమాల ద్వారా మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రభుత్వం నిషేధించిన గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలను ఎవరైనా విక్రయించినా, నిల్వ ఉంచినా తక్షణమే డయల్ 100/112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని అధికారులు ప్రజలను కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. ప్రజల సహకారంతోనే జిల్లాను మత్తు రహితంగా మార్చడం సాధ్యమవుతుందని అధికారులు ఈ సందర్భంగా వెల్లడించారు.

## స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర సాధనలో మరో అడుగు ముందుకేయాలి

### - జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి




కడప, మే 16(భారత శక్తి ): స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర సాధనలో భాగంగా.. మరో అడుగు ముందుకేసి.. రాష్ట్ర ప్రభుత్వ నూతన విధి విధానాలను పాటిస్తూ జిల్లాను స్వచ్ఛంగా ఆరోగ్యవంతంగా మార్చాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. "స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర ప్రదేశ్ " అమలుపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టర్ బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, కేఎంసి కమిషనర్ హెచ్.ఎస్. భావన హాజరయ్యారు.విసి అనంతరం సంబందిత అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మంచి ఆలోచనలు, ఆరోగ్యవంతమైన శరీరం, స్వచ్ఛమైన వాతావరణం, ఇంటి దగ్గర, పనిచేసే చోట పరిశుభ్రతలతో మన రాష్ట్రాన్ని స్వర్ణ ఆంధ్రగా, స్వచ్ఛ ఆంధ్రగా తీర్చిదిద్దుకుందామని అలాగే వైఎస్ఆర్ కడప జిల్లాను కూడా స్వచ్ఛ జిల్లాగా తీర్చి దిద్దేందుకు జిల్లా ప్రజలు బాధ్యత తీసుకునేలా అవగాహన పెంచి ఆ మేరకు స్వచ్ఛత వైపు ఒక ముందడుగేద్దామన్నారు. మూడవ శనివారాన్ని "స్వచ్ఛ దివస్" గా పాటించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర పాటించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు.ముఖ్యమంత్రి సూచనల మేరకు స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమాన్ని, రాష్ట్ర ప్రభుత్వం ఈ - వేస్ట్ మేనేజ్మెంట్ అమలుకు నూతన జీవోను విడుదల చేయడం జరిగిందన్నారు. సిటిజెన్ ఫీడ్ బ్యాక్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. పట్టణాల్లో మ్యాజిక్ డ్రెయిన్స్, స్వచ్ఛ రథం, స్వచ్ఛపథం అనే నూతన కార్యక్రమాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టడం జరిగిందని ఆ కార్యక్రమాలను జిల్లాలో నిరాటంకంగా అమలు చేయాలన్నారు. నగర, పట్టణాల సుందరీకరణ, అన్ని పాఠశాలల నుండి వ్యర్థాలను సేకరించడం, ఎస్టీపి/ ఎన్ఎస్టీపిల నిర్వహణ, స్థల సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర సాధనలో భాగంగా.. ఇప్పటివరకు అత్యుత్తమ సేవలందించి ఉత్తమ అవార్డులకు ఎంపికైన జిల్లాకు చెందిన పీఆర్ శాఖకు జిల్లా కలెక్టర్ అభినందనలు తెలియజేశారు. ముఖ్యమంత్రి అందించిన ప్రశంశలు, అభినందనలతో అదే స్ఫూర్తితో జిల్లా అధికారులు మరింత మెరుగైన సేవలు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈవో సుబ్రహ్మణ్యం, సీపీవో హజరతయ్య, కేఎంసి అదనపు కమీషనర్ రాకేష్ చంద్రం, డీపీవో వెంకట సుబ్బయ్య, మున్సిపల్ కమిషనర్లు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, సంబందిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద గొట్టిముక్కల గ్రామ డ్వాక్రా మహిళా సంఘాలకు న్యాయ విజ్ఞాన సదస్సు

-మానవ అక్రమ రవాణా, పోక్సో చట్టాలపై అవగాహన

-మహిళలు చట్టాల పైన న్యాయవిజ్ఞానం కలిగి ఉండాలి

-ప్రభుత్వ సహాయ న్యాయవాది... డి.శ్రీధర్ రెడ్డి

-లీగల్ సర్వీస్ న్యాయవాది... కాట్రోత్ రాజు నాయక్



మెదక్ జిల్లా, శివంపేట్ , మే 16 (భారత శక్తి న్యూస్): జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాలను మేరకు, మెదక్ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సారథ్యంలో, నర్సాపూర్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ ఆదేశాల ప్రకారం శివంపేట్ మండల్ పెద్ద గొట్టిముక్కుల గ్రామంలో ఐకెపి డ్వాక్రా సంఘాల తో న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాది డి.శ్రీధర్ రెడ్డి,మండల్ లీగల్ సర్వీస్ కమిటీ న్యాయవాది కాట్రోత్ రాజు నాయక్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా డి.శ్రీధర్ రెడ్డి, కే.రాజు నాయక్, వీరి ఇరువురు మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా,వాణిజ్య దోపిడీ నిరోధక పథకం-2015 కింద బాధితులకు అందే న్యాయ సహాయం,రక్షణ చర్యలు, ప్రభుత్వ పునరావాస అవకాశాలను వివరించారు. అలాగే జాగృతి పథకం-2025లో భాగంగా సురక్షిత్ బచ్‌పన్ - సురక్షిత్ భవిష్య కార్యక్రమం ద్వారా చిన్నారుల రక్షణ, పోక్సో చట్టం నిబంధనలు, బాలల హక్కుల పరిరక్షణపై ప్రజలందరూఅవగాహన కలిగి ఉండాలన్నారు. చట్టపరమైనటువంటి ఏవైనా అవాంఛనీయ సంఘటనలు తలెత్తినప్పుడు మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ ద్వారా న్యాయ సహాయాన్ని పొందవచ్చు అన్నారు.ప్రజలు తమ హక్కుల పరిరక్షణకు చట్టాలను తెలుసుకుని అవసరమైనప్పుడు లీగల్ ఎయిడ్ సేవలను వినియోగించుకోవాలని లీగల్ ఎయిడ్ కౌన్సిల్ న్యాయవాది కాట్రోత్ రాజు నాయక్ డ్వాక్రా మహిళలకు తెలియజేయడం జరిగింది. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నవీన్,ఐకెపి ఎపిఎం పెంటా గౌడ్, సి సి యాదగిరి, శివంపేట్ మండల్ ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మీ నర్సమ్మ, ఐకేపీ జిల్లా మాజీ అధ్యక్షురాలు నవనీత,డ్వాక్రా మహిళలు, లీగల్ సర్వీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్టును పరామర్శించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



జగిత్యాల, మే 16 (భారత శక్తి ప్రతినిధి): ధర్మపురికి చెందిన సీనియర్ జర్నలిస్ట్, ఐజేయూ రాష్ట్ర నాయకులు సురేందర్ కుమార్‌ను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శనివారం ఉదయం సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రి లో పరామర్శించారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన సురేందర్ కుమార్‌కు ఇటీవల వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా మంత్రి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎన్నో సంవత్సరాలుగా జర్నలిస్టుగా సేవలందిస్తున్న సురేందర్ కుమార్ త్వరగా కోలుకొని తిరిగి ప్రజాసేవలో కొనసాగాలని మంత్రి ఆకాంక్షించారు.

## బాన్సువాడలోని మాతా శిశు ఆసుపత్రి ను సందర్శించిన జిల్లా కలెక్టర్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మే16: బాన్సువాడలోని మాతా శిశు ఆసుపత్రి (ఎమ్ సి హెచ్ హాస్పిటల్)ను శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై రోగులు, సిబ్బందితో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న సేవలు, వైద్య సదుపాయాలు, పరిశుభ్రత, సిబ్బంది పనితీరును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు, మెరుగైన సదుపాయాలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రోగులకు అవసరమైన చికిత్స, మందులు, వైద్య సేవలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆసుపత్రులలో పరిశుభ్రత, సమయపాలన, సేవల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అనంతరం నూతన ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న ఏరియా ఆసుపత్రి పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనుల నాణ్యత, పురోగతి స్థితిని సమీక్షించి, పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు త్వరలోనే అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విద్య, ఏఈ టీఎస్ఎంఎస్ఐడీసీ సాగర్ రెడ్డి, ఏరియా ఆసుపత్రి, ఎంసీహెచ్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## సకాలంలో బి పాజిటివ్ రక్తం అందజేత

### ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు




కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మే16: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో సామల సుష్మ కు బి పాజిటివ్ రక్తం అవసరం కావడంతో సింగరాయ పల్లి గ్రామానికి చెందిన అధికం నిఖిల్ గౌడ్ సకాలంలో రక్తాన్ని అందజేసి ప్రాణదాతగా నిలవడం జరిగిందని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ, వేసవి కాలం కావడం వలన రక్తనిధి కేంద్రాలలో రక్తం దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని యువత రక్తదానానికి ముందుకు రావాలని, రక్తానికి ప్రత్యామ్నాయ మార్గాలు లేవని స్వచ్ఛందంగా ముందుకు వచ్చే రక్తదాతల తోనే ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చునని అన్నారు. రక్తదాత నిఖిల్ గౌడ్ కు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి రక్తదాతల సమూహ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ వేద ప్రకాష్ అధ్యక్షుడు జమీల్ హైమద్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పుట్ల అనిల్ కుమార్,ఉపాధ్యక్షులు ఎర్రం చంద్రశేఖర్,పర్ష వెంకటరమణ, సలహాదారులు జలిగామ శ్రీకాంత్, అంకం బాలకిషన్ లు పాల్గొన్నారు.

## ఐడీఓసీ ప్రజావాణి హాల్‌లో బెస్ట్ అవైలబుల్ స్కూల్ (బిఎఎస్) డ్రా నిర్వహణ




కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మే16: శుక్రవారం ఐడీఓసీ ప్రజావాణి హాల్‌లో బెస్ట్ అవైలబుల్ స్కూల్ (బిఎఎస్) డ్రా కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్ నిర్వహించారు. విద్యార్థులకు అందుబాటులో ఉన్న పాఠశాలలలో పారదర్శకంగా ప్రవేశాల కేటాయింపు కోసం ఈ డ్రా ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అర్హులైన విద్యార్థులకు సీట్ల కేటాయింపు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిటిడబ్ల్యూఓ సౌజన్య సంబంధిత శాఖల అధికారులు, విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన




నిజామాబాద్, మే 16(భారత శక్తి ): బాల్కొండ నియోజకవర్గం మెండోరా మండలంలోని కోడిచెర్ల గ్రామంలో సైబర్ నేరాలపై ఎస్ఐ సుహాసిని అవగాహన కల్పించారు. ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న కూలీలకు సైబర్ మోసాలను వివరించారు. అనుమానాస్పద ఫోన్ కాల్స్, ఓటీపీలు, బ్యాంకు వివరాలు ఎవరికీ చెప్పొద్దని హెచ్చరించారు. అలాగే కల్తీ కల్లు సేవించడం ఆరోగ్యానికి హానికరమని, వాటికి దూరంగా ఉండాలని తెలిపారు.రోడ్ సేఫ్టీపై కూడా కూలీలకు సూచనలు చేస్తూ, బైక్‌పై ప్రయాణించే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. 18 సంవత్సరాలు నిండని వారికి వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. వేసవి సెలవుల నేపథ్యంలో చిన్నారుల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పిల్లలను చెరువులు, బావులు వంటి ప్రమాదకర ప్రాంతాలకు ఈత కోసం పంపవద్దని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై సూచించారు.

## అదనపు డీఆర్డీఏ ఈజీఎస్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన కుటుంబరావు



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మే16: అదనపు డీఆర్డీఏ ఈజీఎస్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన కుటుంబరావు శనివారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.

## యమధర్మరాజు స్వామివారికి భరణి నక్షత్ర ప్రత్యేక పూజలు



జగిత్యాల, మే 16 (భారత శక్తి ప్రతినిధి): శనివారం భరణి నక్షత్రాన్ని పురస్కరించుకొని అనుబంధ దేవాలయమైన శ్రీ యమధర్మరాజు స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీ యమధర్మరాజు స్వామివారికి పురుషసూక్తం, శ్రీలక్ష్మీ సూక్తం, మన్యుసూక్తంతో అభిషేకాలు నిర్వహించగా, అనంతరం ఆయుష్య హోమం, ప్రత్యేక పూజలు, హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అల్వాల శ్రీనివాస్, అర్చకులు వొద్దిపర్తి కళ్యాణ్ కుమార్, అభిషేక పురోహితులు బొజ్జ సంతోష్ కుమార్, రాజగోపాల్, దేవస్థాన సిబ్బంది, అర్చకులు, అధిక సంఖ్యలో భక్తులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి వ్యూహం.. తెల్లవారుజామున మెరుపు దాడి!

## - అన్నమయ్య జిల్లాలో పోలీసుల 'ఆపరేషన్ వజ్రప్రహార్'..

**మదనపల్లి,(భారత శక్తి)** శాంతిభద్రతల పరిరక్షణే శ్వాసగా, ప్రజల సురక్షిత జీవనమే పరమావధిగా అన్నమయ్య జిల్లా పోలీస్ శాఖ శనివారం తెల్లవారుజామున అత్యంత పకడ్బందీగా రెండు భారీ నిఘా ఆపరేషన్‌లను నిర్వహించింది. జిల్లాను నేరరహితంగా మార్చడానికి, సమాజానికి ముప్పుగా పరిణమిస్తున్న శక్తుల ఆటకట్టించడానికి "ఆపరేషన్ వజ్రప్రహార్" నిర్వహించారు. ఈ వ్యూహాత్మక చర్య శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత, జిల్లా అంతా ప్రశాంతంగా నిద్రిస్తున్న సమయంలో అత్యంత నిశ్శబ్దంగా మొదలైంది. మదనపల్లె, రాయచోటి సబ్ డివిజన్లలోని సమస్యాత్మక ప్రాంతాలే లక్ష్యంగా పోలీసులు కార్యాచరణకు సిద్ధమయ్యారు. సరిగ్గా సమయం ఉదయం 4:00 గంటలు.. కోడికూత కూడా వినబడని ఆ కారుచీకట్లో ప్రజల రక్షణ కోసం పోలీస్ బలగాలు అడుగులు వేశాయి. మదనపల్లె డీఎస్పీ శ్రీమతి బి. పావని గారి నేతృత్వంలో 105 మంది, రాయచోటి డీఎస్పీ శ్రీ ఎం.ఆర్. కృష్ణమోహన్ గారి నేతృత్వంలో 61 మంది.. మొత్తం 166 మంది నిబద్ధత గల పోలీస్ అధికారులు, సిబ్బంది ఏకకాలంలో రంగంలోకి దిగారు. ఎవరికీ ఎటువంటి ముందస్తు సమాచారం లీక్ కాకుండా, అత్యంత రహస్యంగా మదనపల్లె తాలూకా పరిధిలోని కోళ్లబైలు జగన్ కాలనీ, కలకడ మండలం బంగారువాండ్లపల్లి గ్రామాలను పోలీసులు చుట్టుముట్టారు. నిశ్శబ్దంగా సాగిన ఈ మెరుపు తనిఖీలు (కార్డన్ అండ్ సెర్చ్) నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో క్షేత్రస్థాయి సిబ్బంది వీధుల్లో సోదాలు నిర్వహిస్తుండగా, భూతలం నుండి ఎవరూ తప్పించుకోకుండా నిఘాను మరింత పటిష్టం చేశారు. ఈ ఆపరేషన్‌లో జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు అధునాతన డ్రోన్ కెమెరాల ద్వారా గ్రామాలపై గగనతలం నుంచి పర్యవేక్షణ చేపట్టారు. గ్రామంలోని ప్రతి ప్రాంతాన్ని నిశితంగా పరిశీలిస్తూ అసాంఘిక శక్తుల కదలికలను గుర్తించేలా నిఘా కొనసాగించారు. ఈ అధునాతన నిఘా వ్యవస్థతో గ్రామాల్లోని ప్రతి సందు, పొదలు మరియు నిర్మానుష్య ప్రాంతాలను కంట్రోల్ రూమ్ స్క్రీన్లపై నిరంతరం పర్యవేక్షించారు. పోలీసులు పన్నిన ఈ రక్షణ వలయంలో వాహనాల తనిఖీలు ముమ్మరంగా సాగాయి. రహదారి నిబంధనలు ఉల్లంఘిస్తూ, నెంబర్ ప్లేట్లు మార్చి, సరైన రికార్డులు లేకుండా తిరుగుతున్న వాహనాలపై పోలీసులు



ఉక్కుపాదం మోపారు. ఆయా ప్రాంతాలలో అనుమానాస్పదంగా ఉన్న మొత్తం 133 వాహనాలను నిలిపివేసి క్షుణ్ణంగా తనిఖీ చేయగా.. పక్కా ఆధారాలు లేని 78 వాహనాలను స్పాట్‌లోనే స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇందులో 71 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు, 2 కార్లు మరియు ఒక ట్రాక్టర్ ఉన్నాయి. చట్టపరమైన పూర్తి పత్రాలు సమర్పించిన తర్వాతే ఈ వాహనాలను విడుదల చేయడం జరుగుతుందని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అయితే పోలీస్ శాఖ అంటే కేవలం తనిఖీలు, కేసులు మాత్రమే కాదు.. ప్రజలతో మమేకమయ్యే రక్షకులు అని నిరూపిస్తూ, తనిఖీల అనంతరం మదనపల్లెలో 300 మంది, కలకడలో 210 మంది ప్రజలను ఒకచోటకు చేర్చి ముఖాముఖి సమావేశాలు నిర్వహించారు. స్థానిక శాంతిభద్రతల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. "మీ ప్రాంతాల రక్షణే మా బాధ్యత. ఊర్లోకి కొత్త వ్యక్తులు వచ్చినా, లేదా ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు గమనించినా భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించండి" అని స్థానికుల్లో ధైర్యాన్ని నింపారు. అనంతరం సమాజ శ్రేయస్సు కోసం, నేరాల నిర్మూలన కోసం ప్రజలందరితో కలిసి పోలీసులు, ఈగల్ టీమ్ సిబ్బంది "ఆపరేషన్ వజ్రప్రహార్ ప్రతిజ్ఞ" చేయించారు. ప్రజలు, పోలీసులు కలిసికట్టుగా నిలబడిన ఆ క్షణం ఈ ఆపరేషన్‌కే మకుటాయమానంగా నిలిచింది. యువత భవిష్యత్తును పాడు చేస్తూ, సమాజాన్ని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల (గంజాయి, డ్రగ్స్) ముఠాలను వేరుతో సహా తొలగించడమేనని. ఈ సందర్భంగా డిఎస్పీ లు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ఇకపై జిల్లాలో గంజాయి రవాణా చేసినా, విక్రయించినా పాత నేరస్థులైనా, కొత్త వారైనా సరే.. పీడీ యాక్ట్, పి.ఐ.టి, ఎన్‌డీపీఎస్ చట్టాల కింద అత్యంత కఠినమైన జైలు శిక్షలు తప్పవని స్పష్టం చేశారు.

# టిప్పర్ ఢీ కొని నలుగురు మృతి

**కాకినాడ (భారత శక్తి)** కాకినాడ రూరల్ కొవ్వూరు బ్రిడ్జి దగ్గర ఉపాధి పనులకు వెళ్తున్న కూలీలను టిప్పర్ లారీ ఢీ కొట్టింది. ఘటనలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరికి కి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడ్డ వారి పరిస్థితి విషమంగా ఉంది. వారిని చికిత్స నిమిత్తం కాకినాడ జిజిహెచ్ కి తరలించారు. ఉదయాన్నే ఉపాధి పనులకు వెళ్తూ రోడ్డు దాటుతుండగా ప్రమాదం జరిగింది.

# కావూరు వద్ద పొగాకు లారీ బోల్తా

## - తప్పిన పెను ప్రమాదం



**చిలకలూరిపేట(భారత శక్తి):** ప్రకాశం జిల్లా టంగుటూరు నుండి పొగాకు లోడుతో నరసరావుపేట వెళ్తున్న ఒక లారీ, చిలకలూరిపేట మండలం కావూరు వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కకు బోల్తా పడింది. ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని లారీ డ్రైవర్ ఆవేదన వ్యక్తం చేశాడు. అదృష్టవశాత్తూ లారీలోని వారికి కానీ, ఇతర ప్రయాణికులకు కానీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# వృద్ధ దంపతులపై అమానవీయ చర్య

**విజయనగరం (భారత శక్తి)** వృద్ధ దంపతులని అధికారులు ప్రొక్లెయినర్ బకెట్లో కూర్చోబెట్టి భయభ్రాంతులకు గురిచేసారు. విజయనగరం జిల్లాలో భోగాపురం మండలం బైరెడ్డిపాలెంలో దారుణ ఘటన. భోగాపురం ఎయిర్పోర్ట్ అప్రోచ్ రోడ్డు కోసం సేకరించిన భూముల స్వాధీనానికి రెవెన్యూ అధికారులు అమానవీయ చర్యలకు పాల్పడ్డారు. పరిహారం చెల్లించకుండా భూముల స్వాధీనం చేయరాదంటూ రైతులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో రైతులను బయపెట్టెందుకు ఈ చర్యకు దిగారు.

## విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి

# వైద్యుడిపై రేప్ కేసు

**విజయవాడ (భారత శక్తి)** ప్రభుత్వ ఆసుపత్రి లో పనచేస్తున్న డాక్టర్ పై రేప్, అట్రాసిటీ కేసు నమోదయింది. నిందితుడు తనకు పెళ్లైన విషయం దాచి నర్సును రెండో వివాహం చేసుకొని నాలుగేళ్లు కాపురం చేసాడు. మొదటి భార్యకు రెండో వివాహ వ్యవహారం తెలిసింది. దాంతో డాక్టర్ అప్పటి నుంచి రెండో భార్య దగ్గరకు వెళ్లడంలేదు. డాక్టర్ను రెండో భార్య నిలదీసింది. అప్పుడు మొదటి వివాహ విషయం బయటపడింది. పిల్లలు అప్పుడే వద్దంటూ రెండో భార్యకు నిందితుడు రెండుసార్లు అబార్షన్ చేయించాడు. పెళ్లయిన విషయం దాచి మోసం చేశాడంటూ మహిళా పోలీస్ స్టేషన్ లో రెండో భార్య పిర్యాదు చేసింది. ఎన్టీఆర్ జిల్లా మహిళా పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. రేప్ కేసుతో పాటు అట్రాసిటీ కేసు సైతం నమోదు చేసారు.

## వైకాపా మహిళా నేతపై

# కూటమి నేతల బూతు పురాణం

**తిరుపతి (భారత శక్తి)**తిరుపతిలో మహిళపై కూటమి నేతల బూతుల దండకం వివాదానికి దారి తీసింది. వైసీపీ తిరుపతి ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మిని బూతులు తిడుతూ టీడీపీ నేత జేబీ శ్రీనివాస్ అనుచరుడు మాచర్ల రఘురాం పోస్ట్ కామెంట్ పెట్టాడు. దానికి నిరసనగా తిరుపతి గాంధీ విగ్రహం ముందు వైసీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆందోళన చేసారు. నిరసన చేస్తున్న వారిపై కూటమి నేతలు దాడికి ప్రయత్నించారు. పోలీసులు నిరసనకారులను పోలీసు స్టేషన్ కు తరలించారు.

# కోదాడలో "బడిబాట"




**కోదాడ (భారత శక్తి):** పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో శనివారం "బడిబాట" (ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట) కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థినులు కలిసి పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటికీ తిరుగుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో లభించే నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు, మధ్యాహ్న భోజన పథకం మరియు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధన వంటి వసతులను వివరించారు. ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని, బడి వయసు పిల్లలు ఎవరూ బయట ఉండకుండా చూడాలని కోరారు. టాపర్లకు అభినందనల జల్లు:ఇదే వేదికపై, ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించి పాఠశాల కీర్తిని చాటిన విద్యార్థినులు కట్టికోల పూజశ్రీ మరియు మాలవతు పవిత్రలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు తోటి విద్యార్థినులు ఘనంగా అభినందించారు. వారి ప్రతిభ మిగిలిన విద్యార్థినులకు ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి కూడా కార్పొరేట్ సంస్థలకు దీటుగా అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చని ఈ విద్యార్థినులు నిరూపించారని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థినులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## హోటల్లో అగ్ని ప్రమాదం..

# తప్పిన ప్రాణ నష్టం

**సికింద్రాబాద్..(భారత శక్తి)** రెజిమెంటల్ బజార్ మెట్రో పాలిస్ హోటల్ లో తెల్లవారుజామున అగ్నిప్రమాదం సంబంధించినది. ఈ హోటల్లోని మూడవ అంతస్తులో ఉన్న వంట గదిలో నుండి ఒక్కసారిగా మంటలు ఎగిసిపడి పక్కనే ఉన్న రెస్టారెంట్ కు వ్యాపించడంతో అగ్ని ప్రమాద తీవ్రత పెరిగింది. మంటల తీవ్రత వేడి కారణంగా, వంటగదిని ఆనుకుని ఉన్న భోజనశాల అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. అయితే అగ్నిమాపక సిబ్బంది మంటలు మిగిలిన అంతస్తులకు భవనంలోని ప్రక్క భాగాలకు వ్యాపించకుండా నివారించారు. ఈ హోటల్లో బస చేస్తున్న 67 మంది ఈ అగ్ని ప్రమాద ఘటనకు భయాందోళనకు గురికాగా వారిని హైడ్రాలిక్ ప్లాట్ఫామ్ వెహికల్ బ్రాంటో స్కైలిఫ్ట్ ద్వారా సురక్షితంగా కాపాడినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విద్యుతఘాధం మూలంగానే అగ్నిప్రమాదం సంభవించిందని అగ్నిమాపక అధికారులు భావిస్తున్నారు.

## కోదాడ గణపవరం గ్రామంలో

# హత్య కలకలం



**కోదాడ(భారత శక్తి)** గణపవరం గ్రామంలో గణేష్ చదువు రీత్యా బెంగళూరులో ఉంటూ చదువైన తర్వాత బెంగళూరులో జాబ్ చేస్తూ న్నాడు. సెలవులు నిమిత్తం తన గ్రామానికి వచ్చి మూడు రోజులు అయితుండగా తన స్నేహితుడు మ్యారేజ్ ఫంక్షన్ కి రాత్రి 8 గంటల సమయంలో వెళ్లి మరల తన స్నేహితులతో కలిసి కనిపించాడు. తరువాత కనిపించకుండా పోయాడు. గణేష్ కనిపించకపోవడంతో బంధువులు పోలీస్ కంప్లైంట్ ఇచ్చారు. గణేష్ మృతదేహం లక్ష్యం పురం గ్రామం రోడ్డుకి మామిడి తోటలో ఉందని రైతు చూసి గ్రామస్తులకు తెలియజేశాడు. గణేష్ ఒంటిపైన కత్తి పోట్లు, మెడపైన కత్తి తోటి పొడిచి ఒంటి మీద ఉన్న బట్టలన్నీ తీసేసి అతి కిరాతకంగా చంపినట్లు పోలీసులు గుర్తించారు.

# బ్లాక్ స్పాట్లు పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



**కర్నూలు(భారత శక్తి)** పంచలింగాల టోల్గేట్ వద్ద బ్లాక్ స్పాట్స్ పరిశీలన యాత్ర బస్సు ను జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ జెండా ఊపి ప్రారంభించారు. తరువాత పంచలింగాల టోల్గేట్ వద్ద బ్లాక్ స్పాట్ ను పరిశీలిస్తూ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పోలీస్ అధికారులకు, హైవే అధికారులకు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, , జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలు జారీ చేసారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ బ్లాక్ స్పాట్స్ పరిశీలన యాత్ర బస్సులో బయలుదేరి బ్లాక్ స్పాట్ ను పరిశీలిస్తూ, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

# సౌత్‌పై జనసేన ఫోకస్...

జనసేన పార్టీ

**గుంటూరు,(భారత శక్తి)** జనసేనాని పవన్ కళ్యాణ్ తన పార్టీని కేవలం ఆంధ్రప్రదేశ్‌కే పరిమితం చేయకుండా పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, కేరళ, తమిళనాడులకు విస్తరించే పనిలో పడ్డారు. ఇప్పటికే కేరళకు చెందిన పలువురు సామాజిక కార్యకర్తలు, కర్ణాటక నుంచి మాజీ ఎమ్మెల్యేలు జనసేన తీర్థం పుచ్చుకోవడం ఆ పార్టీ నేషనల్ ఇమేజ్ ను పెంచింది. ఎన్డీయే కూటమిలో కీలక నేతగా ఎదిగిన పవన్, దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి గొంతుకగా మారాలని భావిస్తున్నారు. అయితే, ఇతర రాష్ట్రాల్లో విస్తరణ వేగంగా జరుగుతున్నా, సొంత గడ్డ ఏపీలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై ఆయన అడుగులు చాలా నెమ్మదిగా పడుతున్నాయనే చర్చ జోరుగా సాగుతోంది. ఎన్నికలు ముగిసి నెలలు గడుస్తున్నా జనసేనలో ఇప్పటికీ పూర్తిస్థాయి జిల్లా, మండల కమిటీల నియామకం జరగకపోవడం క్యాడర్‌ను కొంత అసహనానికి గురిచేస్తోంది. కూటమి ప్రభుత్వంలో పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా బిజీగా ఉండటం ఒక కారణమైతే, అర్హులైన వారికే పదవులు దక్కాలనే పట్టుదల మరొక కారణం. అయితే, క్షేత్రస్థాయిలో కమిటీలు లేకపోవడం వల్ల ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ, టీడీపీ-బీజేపీ నేతలతో సమన్వయం చేసుకోవడంలోనూ జనసైనికులు కొంత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ జాప్యం వల్ల ద్వితీయ శ్రేణి నాయకత్వంలో గందరగోళం నెలకొంది. జనసేన బలోపేతానికి మరో పెద్ద అడ్డంకి.. పార్టీలోకి కొత్తగా వచ్చి చేరుతున్న వారితో పాటు సోషల్ మీడియా వేదికగా హడావుడి చేస్తున్న కొందరు కార్యకర్తలు. అధికారంలోకి వచ్చాక యాక్టివ్ అయిన వారు ఇప్పుడు నామినేటెడ్ పదవుల కోసం తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నారు. పదవులు రాకపోతే కూటమి ప్రభుత్వంపై, సొంత నాయకత్వంపైనే విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ ధోరణిని పవన్ కళ్యాణ్ తీవ్రంగా పరిగణిస్తున్నట్లు సమాచారం. అందుకే, అడ్వాంటేజ్ కోసం వచ్చే వారిని కాకుండా, పదేళ్ల పాటు పార్టీని నమ్ముకున్న వారికే ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తున్న ఆయన.. బాధ్యతల అప్పగింతలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. టీడీపీతో కలిసి ప్రభుత్వం నడుపుతున్న తరుణంలో, ఎక్కడ ఏ చిన్న తేడా వచ్చినా అది కూటమి పునాదులకే దెబ్బ తగులుతుందని పవన్ భావిస్తున్నారు. అందుకే పార్టీ పరంగా దూకుడు తగ్గించి, పరిపాలనపై ఎక్కువ దృష్టి పెట్టారు. అయితే, ఇదే సమయంలో టీడీపీ తన గ్రామ స్థాయి కమిటీలను పటిష్టం చేసుకుంటుంటే, జనసేన వెనుకబడిపోతోందనే ఆందోళన పార్టీ కార్యకర్తల్లో ఉంది. ముఖ్యంగా నియోజకవర్గాల ఇన్-ఛార్జుల విషయంలో ఇంకా స్పష్టత రాకపోవడం వల్ల కూటమి పార్టీల మధ్య సమన్వయ లోపం కనిపిస్తోంది. ఇతర రాష్ట్రాల్లో పార్టీని విస్తరించడం వల్ల జాతీయ స్థాయిలో జనసేనకు లభించే గుర్తింపు, భవిష్యత్తులో ఏపీలో పార్టీ ఎదుగుదలకు ప్లస్ అవుతుందని ఆయన నమ్ముతున్నారు. పవన్ కళ్యాణ్ రాజకీయం ఇప్పుడు ఎక్కువ మంది చేరడం నిబద్ధత కలిగిన నేతలు వైపు మళ్లింది. ఈ క్రమంలో జరిగే జాప్యం క్యాడర్‌కు ఇబ్బందిగా అనిపించినా, దీర్ఘకాలంలో ఇది పార్టీకి మేలు చేస్తుందని జనసేన అగ్ర నాయకత్వం వాదిస్తోంది. జనసేన పూర్తిస్థాయి కమిటీలతో సరికొత్త రూపం సంతరించుకుంటుందో లేదో వేచి చూడాలి.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే

# విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు

**రేణిగుంట(భారత శక్తి)** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు లభించే నాణ్యమైన విద్య మరియు వసతులను సద్వినియోగం చేసుకోవాలని రేణిగుంట మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) రంగయ్య పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని వెదుళ్ల చెరువు మరియు ఎస్టీసీ కాలనీ పరిసర ప్రాంతాల్లో "బడి పిలుస్తోంది" కార్యక్రమంలో భాగంగా భారీ 'ఎన్రోల్మెంట్ డ్రైవ్' నిర్వహించారు.?ఇంటింటికీ వెళ్లి అవగాహన?ఈ సందర్భంగా ఎంఈఓ రంగయ్య ఉపాధ్యాయ బృందంతో కలిసి ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నేడు కార్పొరేట్ స్థాయికి దీటుగా వసతులు కల్పిస్తున్నామని వివరించారు.

ముఖ్యంగా రాష్ట్ర స్థాయిలో పదవ తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సాధిస్తున్న ఉత్తమ మార్కులు మరియు ర్యాంకుల గురించి తల్లిదండ్రులకు వివరించి, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు.?విద్యార్థులకు దుస్తుల పంపిణీ?కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల పట్ల దాతృత్వాన్ని చాటుకుంటూ దివాకర్ అనే వ్యక్తి విద్యార్థులకు ఉచితంగా బట్టలు పంపిణీ చేశారు. ఈ వితరణను ఎంఈఓ మరియు ఉపాధ్యాయులు అభినందించారు.?ఈ కార్యక్రమంలో గుత్తివారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, మల్లవరం జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం వెంకటరమణ, వెదుళ్ల చెరువు ఎస్టీసీ మోడల్ ప్రైమరీ పాఠశాల హెచ్ఎం మేఘనాథ్, సిఆర్ఎంటి మునయ్య, పాఠశాల కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు మరియు విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# విజయ్ చాలా సరదాగా ఉంటారు

## మాళవిక మోహనన్

టాలీవుడ్, కోలీవుడ్‌లలో వరుస క్రేజీ ఆఫర్లు అందుకుంటూ హీరోయిన్ మాళవిక మోహనన్ దూసుకుపోతోంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో తమిళనాడు సీఎం, కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ పై ప్రశంసల వర్షం కురిపించారు. వారిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన బ్లాక్‌బస్టర్ హిట్ 'మాస్టర్' సినిమా షూటింగ్ జ్ఞాపకాలను ఆమె ఈ సందర్భంగా పంచుకున్నారు. 'మాస్టర్' సినిమా మొదటి రోజు షూటింగ్‌లోనే తనకు చాలా కష్టమైన సీన్ ఎదురైందని, దానివల్ల తన ఫోకస్ మొత్తం డైలాగ్స్‌పైనే పెట్టాల్సి వచ్చిందని మాళవిక తెలిపారు. అయితే, విజయ్ మాత్రం ఎంతటి కష్టమైన సీన్ అయినా సరే.. ఎంతో ప్రశాంతంగా (కూల్‌గా), ప్రతి చిన్న విషయంపై దృష్టి పెడుతూ నటిస్తారని ఆమె కొనియాడారు. సెట్స్‌లో ఆయన అందరితో చాలా సరదాగా ఉంటారని చెప్పారు. మోహన్ లాల్, రజనీకాంత్, విజయ్ వంటి సీనియర్ మోస్ట్ సూపర్ స్టార్ల నుంచి ఎన్నో విలువైన విషయాలు నేర్చుకున్నానని మాళవిక వెల్లడించారు. ముఖ్యంగా వారి టైమ్ మేనేజ్‌మెంట్, క్రమశిక్షణ తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని చెప్పారు. ఉదయం 7 గంటలకు షూటింగ్ అని చెబితే.. వారు ఉదయమే 6.55 కల్లా సెట్స్‌లో హాజరవుతారని స్పష్టం చేశారు. అంతటి పెద్ద స్టార్స్ సమయపాలన పాటించడం వల్లే ఇండస్ట్రీలో నిర్మాతలకు భారీగా డబ్బు వృథా కాకుండా ఉంటుందని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## నేటి యువతకు లవ్, రిలేషన్ అంటే ఏమిటో

# తెలియదు: తమన్నా



హీరోయిన్ తమన్నా భాటియా నేటితరం యువతకు ప్రేమ, బంధాల (రిలేషన్స్) పై సరికొత్త లెక్చర్లు ఇస్తూ వార్తల్లో నిలిచారు. ముఖ్యంగా నటుడు విజయ్ వర్మతో బ్రేకప్ అయినప్పటి నుంచి ఆమె సమయం దొరికినప్పుడల్లా ప్రేమకు సంబంధించిన తన వ్యక్తిగత అభిప్రాయాలను పంచుకుంటున్నారు. అసలు వీరిద్దరి బంధం పెళ్లి వరకు వెళుతుందని అందరూ అనుకుంటే, ఎందుకు సడన్‌గా విడిపోయింది, తమన్నాను విజయ్ వర్మ ఏమైనా అనుమానించారా లేదా మరేదైనా కారణం ఉందా అనే విషయాలను ఇప్పటివరకు ఈ జంట అధికారికంగా బయటపెట్టనప్పటికీ, తాజాగా తమన్నా చేసిన వ్యాఖ్యలు వారి బ్రేకప్ కారణాలపై పలు అనుమానాలకు తావిచ్చేలా ఉన్నాయి. ఇటీవల ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో తమన్నా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి జీవితంలో ప్రేమ అనేది ఒక్కసారి మాత్రమే కాదు, పలుమార్లు పుట్టవచ్చని మరియు అదే నిజమైన ప్రేమ అని వ్యాఖ్యానించారు. నేటితరం యువతకు లవ్, రిలేషన్ అంటే సరిగ్గా తెలియక గందరగోళానికి గురవుతున్నారని ఆమె అభిప్రాయపడ్డారు. ఒక వ్యక్తిని నిజంగా ప్రేమించాలని భావిస్తే వారికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని, మన భావాలను వారిపై బలవంతంగా రుద్దడం ద్వారా ప్రేమను నిరూపించుకోలేమని స్పష్టం చేశారు. ప్రేమ అనేది కేవలం ఒకే ఒకసారి కలిగే అనుభవం కాదని, అది జీవితంలో అనేకసార్లు జరగాల్సిన ప్రేరణ అని పేర్కొంటూ, ఇది బహిరంగంగా హావభావాల ద్వారా వ్యక్తపరిచేది కాదని, అంతర్లీనంగా పుట్టే ఒక భావోద్వేగమని తమన్నా వివరించారు. ఆమె చెబుతున్న ఈ మాటలను బట్టి చూస్తే, ప్రేమ విషయంలో ఆమె వ్యక్తిగత స్వేచ్ఛకు ఎంతగా ప్రాధాన్యత ఇస్తుందో అర్థమవుతోంది.

# ప్రతి అనుభవం ఒక పాఠమే



స్త్రీ స్వేచ్ఛ అనే అంశంపై ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడింది బాలీవుడ్ భామ కైరా అద్వానీ. ఈ నేపథ్యంలో ఏడాది కూడా నిండని తన కుమార్తె సరయు భవిష్యత్ గురించి మాట్లాడుతూ షాకింగ్ కామెంట్లు చేసింది. దీంతో ఆమెపై నెటిజన్లు మండిపడుతున్నారు. ఆ ఇంటర్వ్యూలో కైరా మాట్లాడుతూ 'స్త్రీకి స్వేచ్ఛ అవసరం. కట్టుబానిసగా బతకాల్సిన అవసరం స్త్రీకి లేదు. పెళ్లయినా, డేటింగ్ అయినా ఆమె ఇష్టంతో జరగాలి. నేను అలాగే బ్రతికాను. సరైన వ్యక్తిని ఎంచుకునే క్రమంలో చాలామందితో డేటింగ్ చేశాను. చివరకు సరైన వ్యక్తి దొరికాడు. ఎదిగే క్రమంలో ప్రతి అనుభవం ఒక పాఠమే. అవే మనల్ని మనిషిగా మారుస్తాయి. పొరపాట్లు మానవసహజం. వాటిని దిద్దుకుంటూ ముందుకు సాగడమే జీవితం. నా కూతురు సరయు విషయంలోనూ నేను ఇదే పంథా అనుసరిస్తా. నాలాగే తనూ జీవిస్తుంది. ఈ క్రమంలో తనకు ఎలాంటి ఆంక్షలూ విధించను' అంటూ చెప్పుకొచ్చింది కైరా. ఇక ఈ వ్యాఖ్యలపై నెటిజన్లు తీవ్రంగా స్పందిస్తున్నారు. కూతురు గురించి ఇలాగేనా మాట్లాడేది? ఇదేం ఫెమినిజం? అంటూ ప్రశ్నిస్తున్నారు. కియారా మాట్లాడిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# 'ఎగ్జామ్' సిరీస్ రివ్యూ!




ఒక వైపున హారర్ థ్రిల్లర్లు .. మరో వైపున క్రైమ్ థ్రిల్లర్లు ఓటీటీలను ఊపేస్తున్నాయి. ఇక అడపా దడపా పొలిటికల్ థ్రిల్లర్లు పలకరిస్తూ వెళుతున్నాయి. అయితే అందుకు భిన్నంగా ఒక సిరీస్ ఇప్పుడు అమెజాన్ ప్రైమ్ కి వచ్చింది. ఆ సిరీస్ పేరే 'ఎగ్జామ్'. దుషారా విజయన్ - అదితి బాలన్ ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సిరీస్ లో అబ్బాస్ కీలకమైన పాత్రలో కనిపిస్తాడు. 7 ఎపిసోడ్స్ గా రూపొందిన ఈ సిరీస్, ఈ నెల 15వ తేదీ నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. మరుమల్లి (అదితి బాలన్) డీఎస్పీ గా పనిచేస్తూ ఉంటుంది. తన కూతురుతో కలిసి తల్లి దగ్గర ఆమె ఉంటూ ఉంటుంది. 'తైకార' అనే ప్రదేశానికి ఆమెకి బదిలీ అవుతుంది. జాయినింగ్ రిపోర్ట్ ను సబ్మిట్ చేయడం కోసం ఆమె ఒంటరిగా బయల్దేరుతుంది. ఫారెస్టు ప్రాంతం మీదుగా వెళుతున్న ఆమెను, ఝాన్సీ (దుషారా విజయన్) కిడ్నాప్ చేస్తుంది. జయచంద్రన్ (అబ్బాస్) సూచన మేరకు, మరుమల్లిని ఒక రహస్య ప్రదేశంలో బంధిస్తుంది. మరుమల్లి పేరుతో తాను డీఎస్పీగా ఝాన్సీ డ్యూటీలో చేరుతుంది. తాను మరుమల్లిని కాదనే విషయం బయటికి తెలిసేలోగా తాను వచ్చిన పనిని పూర్తి చేయాలని నిర్ణయించుకుంటుంది. పోటీ పరీక్షలు .. ప్రశ్న పత్రాల లీక్ చేసే వ్యవహారాలు .. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే కోట్ల రూపాయల స్కామ్ వెనుక ఎవరున్నారనేది తెలుసుకోవడానికి ధైర్యంగా ముందుకు వెళుతుంది. ఆ సమయంలోనే ఆమెకి 'కుమరేశన్' పేరు వినిపిస్తుంది. కుమరేశన్ ఎవరు? అతని నేపథ్యం ఏమిటి? పోటీ పరీక్షలకి సంబంధించిన ప్రశ్న పత్రాలను లీక్ విషయంలో అతని పాత్ర ఏమిటి? ఈ మొత్తం వ్యవహారంతో మరుమల్లికి ఉన్న సంబంధం ఎలాంటిది? ఈ విషయంలో ఝాన్సీ ఎందుకు జోక్యం చేసుకుంటోంది? ఆమెను ఇంతటి సాహసానికి పురిగొల్పిన పరిస్థితులు ఎలాంటివి? ఆమెకి సాయం చేసే జయచంద్రన్ ఎవరు? అనే ఉత్కంఠభరితమైన మలుపులతో ఈ కథ ముందుకు వెళుతుంది. చాలామందికి ప్రభుత్వ ఉద్యోగం అనేది ఒక కల. అలాంటి ఒక ప్రభుత్వ ఉద్యోగాన్ని సంపాదించుకోవడానికి వాళ్లంతా ఎంతో కష్టపడుతూ ఉంటారు. ఎలాంటి కోచింగ్ లేని పల్లెటూరి పిల్లలు .. ఆర్థిక పరమైన ఇబ్బందులతో సతమతమయ్యే పిల్లలు ఆ సమస్యలను దాటుకుంటూ పుస్తకాలపై దృష్టి పెట్టడం సామాన్యమైన విశేషమేం కాదు. అలాంటి పిల్లల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టే ఒక నెట్ వర్క్ చుట్టూ తిరిగే కథ ఇది. ఎంతోమంది తెలివైన పిల్లలు పల్లెటూళ్లకే పరిమితమైపోతున్నారు. ఎంతో ప్రతిభ ఉన్నప్పటికీ కాలం కలిసి రాకపోవడం వలన, పేదరికంలో మగ్గిపోతున్నారు. చదువుకోవాలని ఉన్నప్పటికీ, కూలి పనులను దాటుకుని అడుగుముందుకు వేయలేకపోతున్నారు. కానీ ఎలాంటి ప్రతిభలేని కొంతమంది పిల్లలు అడ్డదారుల్లో మార్కులు సంపాదిస్తున్నారు .. సర్టిఫికెట్లు సంపాదిస్తున్నారు .. ఉద్యోగాలు పొందుతున్నారు. అయితే ఈ పోటీ ప్రపంచాన్ని ఎదుర్కోవడానికి పేదరికాన్ని జయించి పట్టణంలో అడుగుపెట్టిన కుమరేశన్ .. ఝాన్సీలకు ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయి? ఆ సవాళ్లను దాటుకుంటూ వాళ్లు ఎలా తమ మార్గంలో ముందుకు వెళతారు? అనే ప్రధానమైన అంశం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. దర్శకుడు నాణానికి ఇరువైపులా అన్నట్టుగా ఒక వైపున కుమరేశన్ ను .. మరో వైపున ఝాన్సీ పాత్రలను చూపిస్తూ కథను పట్టుగా నడిపించాడు. ఈ కథ మూడు కోణాల వైపు నుంచి ప్రేక్షకుల ముందుకు వస్తుంది. ప్రస్తుతం జరుగుతున్న సంఘటనల సమాహారం ఒకటైతే, కుమరేశన్ కి సంబంధించిన ఫ్లాష్ బ్యాక్ .. ఝాన్సీ ఫ్లాష్ బ్యాక్ రెండు వైపులా నుంచి కనెక్ట్ అవుతాయి. ఈ ఇద్దరి ఫ్లాష్ బ్యాకులు ఈ కథకు మరింత బలాన్ని చేకూర్చాయని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. పోటీ పరీక్షలకు సంబంధించిన ప్రశ్న పత్రాలు ఎలా లీక్ అవుతున్నాయి? అవి డబ్బున్న పిల్లల చేతికి ఎలా చేరుతున్నాయి? నిజమైన ప్రతిభ కలిగిన పేద పిల్లలు ఎలా వెనుకబడి పోతున్నారు? సర్కారీ కొలువులు డబ్బున్నవారికి ఎలా అలంకారంగా మారుతున్నాయి? ఇదే పనిగా పెట్టుకున్న నెట్ వర్క్ ఎలా పనిచేస్తుంది? అనేది దర్శకుడు చూపించిన తీరు మెప్పిస్తుంది .. ఆలోచింపజేస్తుంది ఆందోళన కలిగిస్తుంది. 'ఎగ్జామ్' అనే టైటిల్ ఈ సిరీస్ కి కరెక్టుగా సరిపోతుంది. కాకపోతే పోటీ పరీక్షలు .. కోచింగ్ సెంటర్లు .. పేపర్ లీక్ కావడం .. అందుకు సంబంధించిన హడావిడి ఎక్కువగా ఉంటుందని అనుకోవడం సహజం.

# 'కర్తవ్య' మూవీ రివ్యూ!



సైఫ్ అలీ ఖాన్ కథానాయకుడిగా నటించిన సినిమానే 'కర్తవ్య'. గౌరీఖాన్ నిర్మించిన ఈ సినిమాకి 'పుల్కిత్' దర్శకత్వం వహించాడు. సైఫ్ అలీ ఖాన్ పోలీస్ ఆఫీసర్ గా నటించిన ఈ సినిమాను నేరుగా ఈ నెల 15వ తేదీ నుంచి 'నెట్ ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ చేస్తున్నారు. హిందీతో పాటు ఇతర భాషలలోను ఈ సినిమా అందుబాటులో ఉంది. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ జోనర్ లో సాగే కథ ఇది. పవన్ (సైఫ్ అలీ ఖాన్) ఓ సిన్సియర్ పోలీస్ ఆఫీసర్. నిజాయితీ .. క్రమశిక్షణకు నిదర్శనంలా ఆయన కనిపిస్తుంటాడు. తండ్రి హరిహర్ .. తమ్ముడు దిలీప్ .. భార్య వర్ష (రసిక దుగల్) కొడుకు హనీ .. ఇదే అతని కుటుంబం. పవన్ ఫ్యామిలీ నివసిస్తున్న ఆ గ్రామంలో కట్టుబాట్లు చాలా కఠినంగా ఉంటాయి. పరువు హత్యలు ఆ గ్రామంలో ఎక్కువగా జరుగుతూ ఉంటాయి. అలాంటి పరిస్థితులలో పవన్ తమ్ముడు దిలీప్, ప్రీతి అనే ఒక యువతిని తీసుకుని పారిపోతాడు. ఆనంద్ శ్రీ అనే ఒక స్వామిజీపై అనేక వివాదాలు ఉంటాయి. చాలామంది టీనేజ్ అమ్మాయిలు కనిపించకుండా పోవడం వెనుక ఆయన హస్తం ఉందనేది చాలామంది అభిప్రాయం. స్వామిజీ ముసుగులో అతను చేస్తున్న అరాచకాలను గురించి రాసిన జర్నలిస్ట్ 'రీమా'ను కొంతమంది ఆగంతకులు షూట్ చేసి పారిపోతారు. పవన్ కళ్లముందే ఆమె చనిపోతుంది. 'రీమా'ను షూట్ చేసింది ఒక మైనర్ అని తెలుసుకుని పవన్ షాక్ అవుతాడు. 'రీమా'ను హత్య చేయించిన ఆనంద్ శ్రీ, మైనర్ కుర్రాడైన 'హర్పాల్' ను చంపడానికి తన ప్రధానమైన అనుచరుడైన 'నిర్మల్'ను పంపిస్తాడు. స్వామిజీ మనిషిగా పోలీస్ ఆఫీసర్ 'కేశవ్' కూడా హర్పాల్ కోసం గాలిస్తూ ఉంటాడు. తమ ఊరు పెద్దల కంటపడకుండా దీపక్ - ప్రీతిలను రహస్యంగా ఒక ఇంట్లో దాచిన పవన్, ఆనంద్ శ్రీ మనుషులకు దొరక్కుండా హర్పాల్ ను సిటీ దాటించే ప్రయత్నం చేస్తాడు. అప్పుడు ఏం జరుగుతుంది? అందుకు సమాధానంగా ఏ నిర్ణయాన్ని తీసుకోవడాన్ని పవన్ తన కర్తవ్యంగా భావిస్తాడు? అనేది కథ. జీవితంలో ప్రతి ఒక్కరూ ఎన్నో సమస్యలను .. పరీక్షలను ఎదుర్కుంటూ ముందుకు వెళ్లవలసి ఉంటుంది. అలాంటి పరిస్థితులలో ఎలాంటి నిర్ణయం తీసుకోవాలనే ఒక అయోమయానికి లోనవడం జరుగుతూ ఉంటుంది. తప్పు తన ఇంట్లో జరిగినప్పుడు .. సమాజంలో జరిగినప్పుడు తీసుకునే నిర్ణయాలు భిన్నంగా ఉంటాయి. కానీ తనవారైనా .. పరాయివారైనా తన కర్తవ్యాన్ని నిర్వహించడమే కరెక్ట్ అనుకునే ఒక సిన్సియర్ పోలీస్ ఆఫీసర్ కథ ఇది. ఈ కథలో దర్శకుడు హీరో ముందు రెండు సమస్యలను ఉంచుతాడు. ప్రేమ పెళ్లిళ్లను వ్యతిరేకించే పెద్దల వర్గానికి ఎదురెళ్లడం. స్వామిజీ ముసుగులో ఆశ్రమం మాటున అక్రమ కార్యకలాపాలను నిర్వహించే వ్యక్తిని ఎదుర్కోవడం. ఒకే సమయంలో ఈ రెండు సమస్యలతో హీరో సతమతమైపోవడాన్ని చూపిస్తూ వెళ్లారు. రెండు వైపుల నుంచి సమస్యలను పతాకస్థాయికి తీసుకుని వెళుతూ, ఆసక్తిని రేకెత్తించే ప్రయత్నం చేశారు. దర్శకుడు ఈ కథలోని రెండు సమస్యలను లోతుగా ఆవిష్కరించే ప్రయత్నాలు చేయలేదు. కథ చివరిలో హీరో తన కర్తవ్య నిర్వహణను చేపడతాడు. అయితే అందుకు ఆయన ఎక్కువ సమయం తీసుకోలేదు. గన్ తీసి ఒక్కొక్కరినీ షూట్ చేస్తూ వెళతాడు. అయితే స్వామిజీ ట్రాక్ కి సంబంధించి అసలు తలకాయలు మాత్రం అలాగే ఉండటం ఆశ్చర్యంగా అనిపిస్తుంది. మొదటి దగ్గర నుంచి క్లైమాక్స్ కి ముందువరకూ నిదానంగా నడిచిన కథ, ఆ తరువాత హడావిడిగా ముగిసిపోవడం అసంతృప్తిని కలిగిస్తుంది. రొటీన్ కథను రొటీన్ గానే చెప్పడం అసహనాన్ని కలిగిస్తుంది. ఆర్టిస్టుల నటన గురించి మాట్లాడుకోవడానికి పెద్దగా ఏమీలేదు. ఆ స్థాయి సన్నివేశాలు కూడా పడలేదు. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తాయి. కథగా చూసుకుంటే ఇది కూడా ఒక పోలీస్ స్టోరీ అంతే. ఇంతకుముందు ఇలాంటి కథలు చాలానే వచ్చాయి. ఆ కథలకు భిన్నంగా వెళ్లడానికి ఎంతమాత్రం ప్రయత్నించని కంటెంట్ ఇది. చాలా తక్కువమంది ఆర్టిస్టులతో .. సింపుల్ బడ్జెట్ లోనే కానిచ్చేశారు. ఎమోషనల్స్ పరంగా .. యాక్షన్ పరంగా ఎక్కడా కనెక్ట్ కాని కథగానే ఇది మిగిలిపోతుంది.

# ఒంటరి తోడేలు కథ



హీరో రామ్ పోతినేని తొలిసారి మెగాఫోన్ పట్టబోతున్నారు. ఇప్పటికే నటనతో పాటు గాయకుడిగా, గీత రచయితగా సత్తాచాటిన ఆయన దర్శకుడిగా ప్రతిభను చాటేందుకు సిద్ధమవుతున్నారు. తన 23వ సినిమాతో రామ్ పోతినేని దర్శకుడిగా సరికొత్త ప్రయాణాన్ని మొదలుపెడుతున్నారు. స్వీయ దర్శకత్వంలో ఆయన హీరోగా నటించే ఈ సినిమా సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కనుంది. ఈ చిత్రాన్ని 'రాపో' సినిమాటిక్స్ పతాకంపై కృష్ణ పోతినేని నిర్మించనున్నారు. శుక్రవారం రామ్ పోతినేని జన్మదినం సందర్భంగా స్పెషల్ బర్త్‌డే పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో ఆయన 'వీర' పాత్రలో కనిపించనున్నారు. 'ది స్టోరీ ఆఫ్ ఏ లోన్ వూల్ఫ్' అనే క్యాప్షన్ ఆయన పాత్ర తాలూకు ఇంటెన్సిటీని ప్రతిబింబిస్తున్నది. మానసిక సంఘర్షణతో కూడిన ఈ పాత్రలో రామ్ అగ్రెసివ్ యాటిట్యూడ్ కలిగిన వ్యక్తిగా కనిపిస్తాడని, ఆయన మేకోవర్ ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేస్తుందని మేకర్స్ చెబుతున్నారు. జూన్‌లో రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించి డిసెంబర్‌లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. త్వరలో చిత్రానికి సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని వెల్లడించనున్నారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy